

హ్యాపీనెస్ట్ భారం.. రూ.164.5 కోట్లు





- ప్రాజెక్టును పట్టించుకోని వైసీపీ ప్రభుత్వం
- ఐదేళ్లు కాలయాపనతో సీఆర్డీఏకు భారీ నష్టం
- ఎస్‌వోఆర్‌తో భవిష్యత్‌లో మరింత పెరిగే అవకాశం
- అదే పూర్తి చేసి ఉంటే రూ.57.37 కోట్ల లాభం వచ్చేది
- ప్రాజెక్టు పట్టాలెక్కుతుందనే ఆశలో ప్లాట్లు బుక్ చేసుకున్న వారు

హ్యాపీనెస్టు.. భారతదేశపు మొదటి గ్లోబల్ సిటీ ఆఫ్ ది ఫ్యూచర్‌గా ఉండేది. అమరావతి రాజధాని ప్రాంతంలో నివాసం ఉండేవారికి స్వచ్ఛమైన ఆనందాన్ని వెదజల్లేలా.. ఆధునికంగా.. పచ్చదనంతో అభివృద్ధి చేయాలని ఈ హ్యాపీనెస్టు ప్రాజెక్టును అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబు రూపొందించారు. ఈ ప్రాజెక్టు రాష్ట్ర ప్రజలతో పాటు జాతికి గర్వ కారణంగా ఉంటుందని అప్పటి పాలకులతో పాటు ప్రజలు కూడా భావించారు. దీంతో 12 టవర్లలో నిర్మాణం తలపెట్టిన ఈ హ్యాపీనెస్టు ప్రాజెక్టులోని 1200 ఫ్లాట్స్ కోసం అడ్వాన్స్‌లు చెల్లించి మరీ ముందస్తుగా బుకింగ్ చేసుకున్నారు. అయితే 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడం.. జగన్ ముఖ్యమంత్రి కావడంతో ఈ హ్యాపీనెస్టు ప్రాజెక్టుకు శాపమైంది. ఐదేళ్లు దీని గురించి వైసీపీ పాలకులు పట్టించుకోలేదు. దీంతో తమ డిపాజిట్లును వెనక్కు ఇచ్చేయాలని పలువురు సీఆర్‌డీఏని కోరడంతో 2022లో పిల్లిమొగ్గలేసి సాగదీస్తూ వచ్చింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం.. అమరావతి రూపశిల్పి చంద్రబాబు ముఖ్యమంత్రి కావడంతో హ్యాపీనెస్టు ప్రాజెక్టు తిరిగి పట్టా లెక్కుతుందని పలువురు భావిస్తున్నారు. అయితే వైసీపీ ఐదేళ్ల పాలన కారణంగా ఈ ప్రాజెక్టుతో సీఆర్‌డీఏకు రూ.164.5 కోట్ల భారం మోయాల్సి వచ్చింది. ప్రాజెక్టు నిర్మాణం జరిగే కొద్దీ ఎస్‌వోఆర్ పెరిగే అవకాశం ఉండటంతో నష్టం కూడా పెరగనున్నది.

గుంటూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఐకానిక్ సిటీగా అమరావతిని రూపొందించాలన్న నాటి పాలకుల ఆలోచనల నుంచి హ్యాపీనెస్టు ప్రాజెక్టు పుట్టింది. ఆధునికత.. లగ్జరీ.. సంప్రదాయాలు.. స్మార్ట్ లైఫ్‌స్టైల్‌ను మిళితం చేస్తూ ప్రపంచ స్థాయి వాతావరణాన్ని అందుబాటులోకి తెస్తూ.. 80 శాతానికిపైగా భూమిని సుందరమైన ప్రకృతి దృశ్యం చేరువ చేస్తూ హ్యాపీనెస్ట్ ప్రాజెక్టును సీఆర్‌డీఏ అమరావతి రాజధానిలోని నేలపాడు గ్రామంలో ప్రతిపాదించింది. అందులో నివాసం ఉండేందుకు ఫ్లాట్ల బుకింగ్ కోసం ప్రపంచ వ్యాప్తంగా పలువురు పోటీ పడ్డారు. అయితే హ్యాపీనెస్టు ప్రాజెక్టుపై వైసీపీ పాలకులు కత్తిదూశారు. ఈ ప్రాజెక్టు గురించి టీడీపీ ప్రభుత్వ హయాంలో సర్వత్రా చర్చ జరిగింది. 12 టవర్లలో నిర్మాణం తలపెట్టిన 1200 ఫ్లాట్స్‌కు రాష్ట్రంలోనే కాకుండా ఇతర రాష్ట్రాలు, దేశాల్లో ఉన్న తెలుగువారి నుంచి కూడా విపరీతమైన స్పందన లభించింది. ఆన్‌లైన్‌లో బుకింగ్స్ ప్రారంభించగానే హాట్ కేక్‌లా బుకింగ్ అయ్యాయి. అడ్వాన్స్‌లు చెల్లించి మరీ ముందస్తుగా బుకింగ్ చేసుకున్నారు. ఆ ప్రాజెక్టు పూర్తి అయి ఉంటే ఈ పాటికే ఆ ఒక్క హ్యాపీనెస్టులోకే 1200 కుటుంబాలు వచ్చి నివాసం ఉండేవే. అయితే వైసీపీ ప్రభుత్వం తన ఐదేళ్ల పాలనలో హ్యాపీనెస్టుని పక్కన పెట్టేసింది. దీంతో ఇప్పుడు ఆ ప్రాజెక్టు నిర్మాణ ఖర్చు గణనీయంగా పెరిగింది. 2024-25 ఎస్‌వోఆర్ ప్రకారం దాదాపుగా రూ.885 కోట్లను వెచ్చించాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది. ఇది ప్రాజెక్టు ప్రారంభంలో వేసిన అంచనా విలువ రూ.720.5 కోట్లతో పోల్చితే దాదాపుగా రూ.164.5 కోట్లు అదనం. ఇప్పుడు ఈ మొత్తాన్ని ఏపీసీఆర్‌డీఏ భరించాల్సిన పరిస్థితి ఉత్పన్నమైంది.



నేలపాడులో నిర్మించాల్సిన 12 బ్లాక్‌ల హ్యాపీనెస్ట్ టవర్స్

చంద్రబాబు ఆమోదం.. జగన్ ద్రోహం

అమరావతి రాజధాని నగరానికి గత సీఎం జగన్ చేసిన ద్రోహం అంతా ఇంతా కాదు. రాజధానికే కాకుండా ఇక్కడ నివాసం ఉండాలని ఆలోచన చేసిన వారికి కూడా తీరని అన్యాయాన్నే చేశారు. 2014-19 మధ్య టీడీపీ ప్రభుత్వ హయాంలో రెసిడెన్షియల్ బిల్డింగ్స్ నిర్మాణంలో జోరు పెంచేందుకు ఏపీసీఆర్‌డీఏ హ్యాపీనెస్టు ప్రాజెక్టుని నిర్మాణం చేయాలని నిర్ణయించింది. దీనికి సంబంధించి డీపీఆర్‌ని రూపొందించి ఆన్‌లైన్‌లో ఉంచింది. నేలపాడులోని 14.46 ఎకరాల విస్తీర్ణంలో సకల సదుపాయాలతో ఈ హ్యాపీనెస్టు ప్రాజెక్టుని ఒక రోల్‌మోడల్‌గా నిర్మించాలని భావించింది. 19 అంతస్తులతో ఒక్కో టవర్ నిర్మాణం చేయాలని నిర్ణయించింది. 1225, 1295 ఎస్ఎఫ్‌టీ విస్తీర్ణంలో 2 బీహెచ్‌కే ఫ్లాట్స్, 1510, 1590, 1630, 1710, 1870, 1980, 2120, 2245, 2640, 2750 ఎస్ఎఫ్‌టీలలో 3 బీహెచ్‌కే ఫ్లాట్స్‌ని నిర్మించేందుకు ప్లాన్ కూడా ఆమోదం లభించింది. ఇందులోనే ఎయిర్ కండీషన్ జిమ్, క్రికెట్ ప్రాక్టీసు నెట్స్, స్కేటింగ్ రింగ్, రాక్ క్లయింబింగ్, ఏసీ మల్టీపర్పస్ హాల్, పార్టీ లాన్, లాంజ్, సెలూన్, ఏరోబిక్స్ హాల్, బ్యాడ్మింటన్ కోర్టులు, యోగా రూం, స్క్వాష్ కోర్టు, స్విమ్మింగ్ పూల్, టేబుల్ టెన్నిస్, క్లినిక్, ఫార్మసి డెస్కు, యాంపిథియేటర్, ధాన్యం వనం, జాగింగ్, రన్నింగ్ ట్రాక్, ఏటీఎంలు, బిజినెస్ సెంటర్‌లు, సూపర్ మార్కెట్‌లు వంటి సకల సదుపాయాలను నిర్మించేందుకు ప్లాన్స్ ఆమోదం పొందాయి. ఈ కారణంగానే 1200 ఫ్లాట్స్‌లో 1,187 ఇట్టే బుకింగ్ అయిపోయాయి. దీని నిర్మాణం పూర్తి అయితే సీఆర్‌డీఏకి రూ.57.37 కోట్ల లాభం కూడా వస్తుందని అప్పట్లో అంచనా వేశారు. ఈ ప్రాజెక్టుకి సంబంధించి ఏజెన్సీని కూడా అప్పట్లో సీఆర్‌డీఏ ఖరారు చేసింది. అయితే గత వైసీపీ ప్రభుత్వం వస్తూనే టెండర్లు రద్దు చేసింది. దాంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా మారింది. ఈ క్రమంలో ఫ్లాట్స్ బుకింగ్ చేసుకున్న చాలామంది తమ డిపాజిట్లు వెనక్కు ఇచ్చేయాలని సీఆర్‌డీఏని కోరారు. దాంతో వైసీపీ ప్రభుత్వ హయాంలో 2022లో సీఆర్‌డీఏ తాను హ్యాపీనెస్టుని నిర్మిస్తానని పిల్లిమొగ్గలేసింది. ఏజెన్సీని కూడా ఖరారు చేయనున్నట్లు ప్రకటించింది. అయితే అది ఎంతమాత్రం కార్యరూపం దాల్చలేదు. ఇప్పుడు దీనిపై ప్రభుత్వం రూ.164.5 కోట్ల భారం మోయాల్సిన పరిస్థితి. ప్రాజెక్టు నిర్మాణం జరిగే కొద్దీ ఎస్‌వోఆర్ పెరిగే అవకాశం ఉండటంతో నష్టం కూడా పెరుగుతుంది.



కుటుంబ సభ్యులతో లక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని దర్శించుకున్న డీజీపీ ద్వారక తిరుమలరావు

మూతపడిన విభాగాలు పునరుద్ధరణ

- ఎల్‌హెచ్‌ఎంఎస్, ఫింగర్ ప్రింట్ డివైజ్ ప్రారంభం
- పోలీసుల పనితీరులో పారదర్శకం, జవాబుదారీతనం
- గుంటూరులో డీజీపీ ద్వారక తిరుమలరావు

గుంటూరు, జూలై 7: గత ప్రభుత్వ హయాంలో కారణం ఏమైనప్పటికీ పోలీస్ శాఖలో కొన్ని విభాగాలు మూతపడ్డాయని, వాటిని పునరుద్ధరిస్తామని డీజీపీ ద్వారకా తిరుమలరావు తెలిపారు. ఆదివారం ఆయన గుంటూరు కృష్ణనగర్ లోని శ్రీలక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో మూతపడిన ఫింగర్ ప్రింట్ డివైజ్‌ను పునరుద్ధరిస్తామని తెలిపారు. విదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన ఈ డివైజ్‌ను వినియోగించి అక్కడికక్కడే నేరస్తులను గుర్తించవచ్చన్నారు. దీనితోపాటు లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం(ఎల్‌హెచ్‌ఎంఎస్)ను కూడా పునరుద్ధరిస్తామన్నారు. ఈ విధానం ద్వారా ఎవరైనా ఊళ్లకు వెళుతుంటే స్థానిక పోలీసులకు సమాచారం ఇస్తే ఎటువంటి ఖర్చు లేకుండా తామే ఆ ఇంటిలో రహస్యంగా కెమెరా అమర్చి వారు తిరిగివచ్చే వరకు కాపలాకాయడం జరుగుతుందని తెలిపారు. తద్వారా నేరాలను అరికట్టడంతో పాటు నేరస్తులను కూడా రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకునే వెసులుబాటు కలుగుతుందన్నారు. పౌర కేంద్రీకృత పోలీసింగ్‌ను అమలు చేయనున్నట్లు తెలిపారు. పోలీసుల పనితీరు పారదర్శకంగా, జవాబుదారితనంగా ఉండబోతుందన్నారు. పౌరులకు మరింతగా సేవలందించి ప్రజల మన్ననలు పొందేవిధంగా పోలీసుల పనితీరు ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రధానంగా సాంకేతికపరమైన ఆధారాల ఆధారంగా కేసుల దర్యాప్తు ఉంటుందన్నారు. మాజీ ప్రజా ప్రతినిధులకు భద్రత తొలగించిన విషయంపై విలేకర్ల ప్రశ్నకు డీజీపీ స్పందిస్తూ వారి భద్రతపై సమీక్షించి నిర్ణయం తీసుకుంటామన్నారు. పోలీస్ శాఖలో కిందిస్థాయి ఉద్యోగులపై ప్రత్యేక దృష్టి సారించి వారి సంక్షేమానికి పెద్దపీట వేస్తామని హామీ ఇచ్చారు.

జ్ఞాపకాలను గుర్తు చేసుకున్న డీజీపీ

తన చిన్నతనంలో కృష్ణనగర్ ప్రాంతంలో నివాసం ఉండి ఇక్కడే చదువుకున్నట్లు డీజీపీ ద్వారక తిరుమలరావు నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అప్పట్లో కుటుంబ సమేతంగా నరసింహస్వామి ఆలయాన్ని సందర్శించుకునే వాడినని చెప్పుకొచ్చారు. చిన్నతనంలో లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఉండేదని, ఆ తర్వాత క్రమంలో ఆలయాన్ని పునరుద్ధరించారని, ఆ తర్వాత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయాన్ని కూడా నిర్మించినట్లు తెలిపారు. ఆ సమయంలోనూ తాను ఇక్కడకు వచ్చి స్వామి వారిని దర్శించుకున్నట్లు తెలిపారు. తాను చిన్నతనంలో ఈ సమీపంలోనే నివాసం ఉండి ఈ ప్రాంతంలోనే చదువుకున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వహణ కమిటీ ప్రతినిధి, విశ్రాంత ఏఎస్పీ కోటేశ్వరరావు, వెస్ట్ డీఎస్పీ మహేష్, పట్టాభిపురం సీఐ విజయచంద్రతో పాటు పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తగణేశునిపాడులో భారీ చోరీ

- 50 సవర్ల బంగారం, 2.50 లక్షల నగదు, కేజీ వెండి అపహరణ

గంజాయి విక్రయిస్తున్న ముఠా అరెస్టు

4లో..

- గంజాయి, కారును సీజ్ చేసిన పోలీసులు

కబ్జా.. కష్టమే..



నిర్వహణ లేకపోవడంతో గోడలపై మొలిచిన రాగిచెట్టు

- భవనాన్ని వినియోగంలోకి తీసుకురావాలని విద్యార్థులు వినతి
- సమీకృత హాస్టల్‌పై నాడు కన్నేసిన వైసీపీ నేత
- ప్రస్తుతం ఆ నేత మాజీ.. ఇప్పటికైనా కొలిక్కివచ్చేనా
- 90 శాతం పనులు పూర్తి.. 500 మందికి వసతి సౌకర్యాలు

గుంటూరు(విద్య), జూలై 7: కులమతాలకు అతీతంగా విద్యార్థులకు వసతి కల్పించి వారి విద్యాభివృద్ధికి బాటలు వేయాలనే మహోన్నత లక్ష్యంతో సమీకృత భవన నిర్మాణం చేపట్టారు. అయితే ఆ తర్వాత అధికారం చేపట్టిన వైసీపీ పాలకులు దానిని కబ్జా చేసేందుకు ప్రయత్నించారు. అయితే అప్పట్లోనే విద్యార్థులు, ప్రజాసంఘాలు అడ్డుకోగా ఆ నేత వెనక్కి తగ్గారు. అయినా లీజు పేరుతో కబ్జా పాలవుతుందని విద్యార్థులు ఆందోళనలో ఉన్నారు. అయితే తాజా ఎన్నికల్లో మాజీగా మారడంతో ఆ నేత మాస్టర్‌ప్లాన్‌కు చెక్ పడింది. ఇదీ గుంటూరులోని బ్రహ్మానందరెడ్డి స్టేడియం ఎదురుగా ఉన్న సమీకృత (ఇంటిగ్రేటెడ్) హాస్టల్ భవనం కథ. గతంలో ఈ ప్రాంగణంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు ప్రత్యేకంగా మూడు వసతి గృహాలు ఉండేవి. వివిధ ప్రాంతాలకు చెందిన దాదాపు మూడో తరగతి నుంచి 10వ తరగతి స్థాయి వరకు 400 మంది విద్యార్థులకు వసతి కల్పించేవారు. ఇదే ప్రాంగణంలో ప్రాథమిక పాఠశాల కూడా ఉండేది. కాలక్రమేణ ఇక్కడ భవనాలు శిథిలావస్థకు చేరడంతో ప్రభుత్వం ఇక్కడ ఇంటిగ్రేటెడ్ హాస్టల్ నిర్మించాలని నిర్ణయించింది. ఇందుకు తగ్గట్లు 2013కు ముందున్న కాంగ్రెస్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఆ తర్వాత టీడీపీ ప్రభుత్వం ఈ భవన నిర్మాణానికి రూ.5 కోట్లు నిధులు కేటాయించింది. పనులు ప్రారంభమైన రెండేళ్లకు 90 శాతం పూర్తి చేశారు. ఆ తర్వాత 2019లో వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ భవన నిర్మాణం గురించి పట్టించుకోలేదు. దీంతో పనులు నత్తనడకన సాగాయి. ఈ భవనం పూర్తి అయితే దాదాపు 500మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ ఇతర సామాజికవర్గాల విద్యార్థులకు వసతి కల్పించే అవకాశం ఉండేదని అధికారులు చెప్పారు. అయినా వైసీపీ పాలకులు ఈ పనులపై దృష్టి సారించలేదు. మిగిలిన పనులు పూర్తి చేసి వినియోగంలోకి తీసుకు వచ్చేందుకు కృషి చేయాల్సిన వైసీపీ నేత లీజు పేరుతో కబ్జా చేసి షాపింగ్ మాల్‌గా భవనాన్ని మార్చాలని స్కెచ్ వేశారు. బీఆర్ స్టేడియం ఎదురుగా వ్యాపార కూడలిలో ఉన్న ఈ భవనాన్ని లీజు పేరుతో కబ్జా చేయాలని అప్పట్లో ప్రయత్నించాడు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గాలకు చెందిన ఈ స్థలాన్ని, బిల్డింగ్‌ను స్వాధీనం చేసుకుని షాపింగ్‌మాల్ ఏర్పాటు చేసేందుకు సిద్ధమయ్యాడు. ఈ గలీజు ఆలోచన విషయం తెలిసిన విద్యార్థి, ప్రజాసంఘాలు అప్పట్లో పెద్దఎత్తున ఆందోళనకు దిగాయి. దీంతో ఆ నేత వెనక్కి తగ్గాడు. వందల మంది విద్యార్థులకు వసతి కల్పించే భవనాన్ని షాపింగ్‌మాల్‌గా మార్చాలనుకున్న ఆ నేత ఇటీవల జరిగిన ఎన్నికల్లో మాజీ అయ్యాడు. దీంతో ఈ భవనం కబ్జా కోరల నుంచి బయటపడింది. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం అరకొర మిగిలిన పనులను పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తేవాలని విద్యార్థి సంఘాల నేతలు కోరుతున్నారు. ఈ మేరకు అధికారులకు ప్రజలు, విద్యార్థి సంఘాలు విజ్ఞప్తి చేస్తున్నారు.



భవనం లోపల ఉన్న ఫ్లోరింగ్ మెటీరియల్



బీఆర్‌స్టేడియం ఎదురుగా నిర్మాణం పూర్తి అయిన సమీకృత హాస్టల్ భవనం

ఇసుక లోడింగ్ టన్నుకు రూ. 250



- 9,23,372.45 మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలు
- నేటి నుంచి స్టాక్ పాయింట్ల వద్ద అందుబాటులోకి
- ఆధార్ కార్డు చూపి రోజుకు 20 టన్నులు పొందవచ్చు
- ఇసుక సమస్యలపై ఫిర్యాదులకు ప్రత్యేక నెంబరు 08632234301


గుంటూరు, జూలై 7 (ఆంధ్రజ్యోతి): ఉచిత ఇసుక విధానం జిల్లా వ్యాప్తంగా సోమవారం నుంచి అమల్లోకి రానున్నది. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టర్ నాగలక్ష్మి వివిధ శాఖల అధికారులతో చర్చించిన అనంతరం స్టాక్‌పాయింట్ల వద్ద లారీలో ఇసుక లోడింగ్‌కు మెట్రిక్ టన్నుకు రూ.250గా ధర నిర్ణయించారు. ఇక ఎలాంటి ఛార్జీలు చెల్లించాల్సిన అవసరం లేదు. లారీ/ట్రాక్టర్/ఎద్దులబండికి సంబంధించిన రవాణా ఛార్జీలు వినియోగదారుడే భరించాల్సి ఉంటుంది. అక్రమాలను నిరోధించేందుకు పూర్తిగా డిజిటల్ చెల్లింపుల విధానాన్ని అమలు చేయనున్నారు. స్టాక్‌పాయింట్ల వద్ద ఎలాంటి నగదు లావాదేవీలు జరగవన్న విషయాన్ని వినియోగదారులు గుర్తించాల్సి ఉంటుంది. యూపీఐ ద్వారా నగదుని స్టాక్‌పాయింట్ వద్ద చెల్లిస్తే సరిపోతుంది.

జిల్లాలో ఐదు స్టాక్‌యార్డులు

జిల్లాలో మొత్తం ఐదు స్టాక్‌యార్డుల్లో ఇసుక అందుబాటులో ఉంటుంది. కొల్లిపరలో 33,388.50 మెట్రిక్ టన్నులు, మున్నంగిలో 1,81,303.50, గుండిమెడలో 20,958, తాళ్లాయపాలెంలో 3,91,242.399, లింగాయపాలెంలో 2,98,480.05 మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వ ఉన్నట్లు గుర్తించారు. ఇందుకోసం మైనింగ్ అధికారులు శాస్త్రీయ విధానాన్ని అనుసరించారు. మొత్తంగా 9,23,372.45 మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలు జిల్లాలో ఉన్నాయి. ఇవి నెల నుంచి రెండు నెలలకు పైగా ప్రజల అవసరాలకు సరిపోతాయని భావిస్తున్నారు. స్టాక్‌యార్డులో ఎవరైతే ముందు వెళతారో వారికి తొలిగా ఇసుకని సరఫరా చేస్తారు. ఒక్కో వ్యక్తి ఆధార్ కార్డు చూపించి రోజుకు 20 మెట్రిక్ టన్నుల వరకు ఇసుకని తీసుకెళ్లొచ్చు.

ఫిర్యాదులకు అవకాశం

స్టాక్‌యార్డుల వద్ద ఎలాంటి సమస్యలున్నా ఫిర్యాదు చేసే అవకాశాన్ని జిల్లా యంత్రాంగం కల్పించింది. కలెక్టరేట్‌లో కంప్లయింట్ మానిటరింగ్ టోల్ ఫ్రీ నెంబర్‌ని ఏర్పాటు చేసింది. వినియోగదారులు 0863 2234301కి ఫోన్ చేసి సమస్యలపై ఫిర్యాదు చేయొచ్చు. అలానే మెయిల్ ఐడీని కూడా అందుబాటులోకి తీసుకొచ్చింది. ఆంగ్లంలో డీఐసీఎంసీ 2024కి జీమెయిల్ చేస్తే సరిపోతుంది. తక్షణమే ఆయా ఫిర్యాదులపై అధికారులు స్పందించి చర్యలు తీసుకుంటారు. వీటిని కలెక్టర్ నాగలక్ష్మి కూడా పర్యవేక్షిస్తారు. కాగా రవాణా ఛార్జీలను లారీ/ట్రాక్టర్ యజమానులు విపరీతంగా వసూలు చేయకుండా ఉండేందుకు ఉప రవాణా శాఖ కార్యాలయం చర్యలు చేపడుతుంది. కిలోమీటర్‌కు రవాణా శాఖ నిర్ణయించిన ఛార్జీలనే వసూలు చేయాల్సి ఉంటుంది.



మంత్రి లోకేశ్ ప్రత్యేక చొరవతో దివ్యాంగ విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా

- వాట్సాప్‌లో అందిన సమాచారంపై తక్షణమే స్పందన
- ఇంటర్ మార్కుల మెమోలో సమస్యకు పరిష్కారం
- జీవో విడుదలతో 25 మంది దివ్యాంగ విద్యార్థులకు సీట్లు
- పేరొందిన ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశాలు

మంగళగిరి సిటీ, జూలై 7: వాట్సాప్ ద్వారా అందిన సమాచారంతో తక్షణమే స్పందించిన రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ 25మంది దివ్యాంగ విద్యార్థుల భవిష్యత్తును కాపాడారు. మంత్రి లోకేశ్ చొరవతో ఆ విద్యార్థులు దేశ వ్యాపితంగా పేరుగాంచిన ఐఐటీ, ఎన్ఐటీ విద్యా సంస్థల్లో ప్రవేశం పొందగలిగారు. విజయవాడకు చెందిన దివ్యాంగ విద్యార్థి మారుతీ పృథ్వీ సత్యదేవ్ ఈ ఏడాది నిర్వహించిన జేఈఈ అడ్వాన్స్ పరీక్షల్లో దివ్యాంగుల కోటాలో 170వ ర్యాంకు సాధించాడు. ఈ ర్యాంకు ప్రకారం సత్యదేవ్‌కు చెన్నయ్ ఐఐటీలో సీటు రావలసి వుంది. అయితే దివ్యాంగ విద్యార్థులకు ఇచ్చే మార్కుల మెమో విషయంలో రాష్ట్ర ఇంటర్ అధికారులు ఎప్పటినుంచో చేస్తున్న ఓ పొరపాటు దివ్యాంగ విద్యార్థులను ఇబ్బందుల్లోకి నెట్టింది. సత్యదేవ్‌కు తాను సాధించిన ర్యాంకు ప్రకారం జోసా కౌన్సెలింగ్ రౌండ్-1లో ఐఐటీ మద్రాసులో సీటు కేటాయించారు. డాక్యుమెంట్ వెరిఫికేషన్ ప్రక్రియలో భాగంగా ఇంటర్మీడియట్ మెమో సర్టిఫికెట్‌ను అప్‌లోడ్ చేయాలని కోరారు. ఏపీ ఇంటర్ బోర్డు నిబంధనల ప్రకారం దివ్యాంగులకు లాంగ్వేజ్ సబ్జెక్టుల్లో రెండింటిలో ఒకదానికి మినహాయింపు వుంటుంది. దీని ప్రకారం సత్యదేవ్ సెకండ్ లాంగ్వేజ్ పరీక్ష రాయలేదు. ఇంటర్ పరీక్షల్లో ఏ-గ్రేడ్ ఉత్తీర్ణత సాధించాడు. మినహాయింపు పొందిన లాంగ్వేజ్ సబ్జెక్టుతో కలిపి మార్కుల మెమోలో 5 సబ్జెక్టుల మార్కులు వుంటాయి. మినహాయింపు పొందిన సబ్జెక్టుకు సంబంధించి సర్టిఫికెట్‌లో ఇంటర్‌బోర్డు వారు ఎప్పటినుంచో 'ఈ' (ఎగ్జమ్షన్) అని మాత్రమే పేర్కొంటున్నారు.

కానీ, ఐఐటీ మద్రాస్ డాక్యుమెంట్ వెరిఫికేషన్ విభాగం వారు సత్యదేవ్ మెమోలో కేవలం నాలుగు సబ్జెక్టులు మాత్రమే వున్నాయని, గణితం-ఏ, బీలను ఒకే సబ్జెక్టుగా పరిగణిస్తున్నామని పేర్కొంటూ ఇంటర్మీడియట్ మెమోను తిరస్కరిస్తున్నామని సమాధానమిచ్చారు. దీనిపై సత్యదేవ్ ఐఐటీ మద్రాసు వారిని సంప్రదించగా, సెకెంట్ లాంగ్వేజ్ సబ్జెక్టుకు సంబంధించి సర్టిఫికెట్‌లో 'ఈ' స్థానంలో నిర్దిష్ట సంఖ్యా విలువను కలిగివుంటేనే కళాశాలలో ప్రవేశానికి అవకాశం కల్పిస్తామని చెప్పారు. ఇంటర్ బోర్డు సర్టిఫికెట్ అప్‌లోడ్ విషయంలో ఎదురైన సమస్యను సత్యదేవ్ గత నెల 22వ తేదీన వాట్సాప్ ద్వారా మంత్రి నారా లోకేశ్‌కు తెలియజేశారు. వెంటనే స్పందించిన మంత్రి లోకేశ్ సత్యదేవ్, అతని తండ్రి జయరామ్‌తో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. దివ్యాంగ విద్యార్థులకు ఎట్టి పరిస్థితుల్లో అన్యాయం జరగకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇంటర్ బోర్డు అధికారులు వెంటనే స్పందించి మార్కుల మెమోలో 'ఈ' స్థానంలో కనిష్టంగా 35 మార్కులుగా పేర్కొంటూ మార్కుల మెమో జారీచేశారు. దీనికి సంబంధించి ఆగమేఘాలపై జీవోను కూడా విడుదల చేశారు. దీంతో పృథ్వీ సత్యదేవ్‌కు ఐఐటీ మద్రాసులో సీటు లభించింది. ఈ జీవోతో రాష్ట్రంలోని మొత్తం 25మంది దివ్యాంగ విద్యార్థులకు జాతీయస్థాయిలో పేరొందిన ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీ విద్యాసంస్థల్లో సీట్లు లభించాయి. తమ భవిష్యత్తును కాపాడిన మంత్రి లోకేశ్‌కు సత్యదేవ్‌తోపాటు దివ్యాంగ విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. సోమవారం ఉండవల్లిలోని నివాసంలో మంత్రి లోకేశ్ దివ్యాంగ విద్యార్థులను కలిసి అభినందించనున్నారు.

సీట్లు పొందిన విద్యార్థులు వీరే..

మంత్రి నారా లోకేశ్ ప్రత్యేక చొరవతో జీవో విడుదల కావడంతో రాష్ట్రంలోని మొత్తం 25 మంది దివ్యాంగ విద్యార్థులకు జాతీయ స్థాయిలో పేరొందిన ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీ విద్యాసంస్థల్లో సీట్లు సాధించారు. విజయవాడకు చెందిన పృథ్వీ సత్యదేవ్ ఐఐటీ మద్రాస్, నెల్లూరుకు చెందిన ఎన్.స్నేహిత ఐఐటీ కాన్పూర్, తిరుపతికి చెందిన ఎ.తేజిత చౌదరి ఐఐఐటీ, గౌహతి, నెల్లూరుకు చెందిన పీ.నిష్మిత ఎన్ఐటీ నాగపూర్, విజయవాడకు చెందిన సి.రఘునాథ్‌రెడ్డి ఐఐటీ కాలికట్, రాజమహేంద్రవరానికి చెందిన ఎం.మోహన్ నాగమణికంఠ ఎన్ఐటీ జలంధర్, పామర్రుకు చెందిన బి.విజయరాజు ఐఐటీ తిరుపతి, కర్నూలుకు చెందిన కే.ప్రశాంత్ ఎన్ఐటీ సిల్చార్, విజయవాడకు చెందిన జీ.కృష్ణసాయి సంతోష్ ఎన్ఐటీ సూరత్కల్, రాజమహేంద్రవరానికి చెందిన జీ.వంశీకృష్ణ ఎన్ఐటీ వరంగల్, కర్నూలుకు చెందిన వి.వేదచరణ్‌రెడ్డి ఐఐటీ మద్రాసు, నెల్లూరుకు చెందిన నాయుడు రక్షిత్ ఎన్ఐటీ నాగాలాండ్, పెనమలూరుకు చెందిన ఈ.మహిధర్‌రెడ్డి ఐఐటీ ఇండోర్, అనంతపురంకు చెందిన డి.మోక్షశ్రీ ఎన్ఐటీ నాగాలాండ్, రాజమహేంద్రవరంకు చెందిన పీ.దినేష్ ఎన్ఐటీ కురుక్షేత్ర, బి.కోటకు చెందిన జే.మనోజ్‌కుమార్ ఐఐటీ గోవా, నందిగామకు చెందిన సీహెచ్ శివరామ్ ఐఐటీ అగర్తల, విజయవాడకు చెందిన బి.అభిజిత్ ఎన్ఐటీ అరుణాచల్‌ప్రదేశ్, కాకినాడకు చెందిన జీ.రాణి ఐఐటీ ఖరగ్‌పూర్, గుంటూరుకు చెందిన కే.గోకుల్‌సాయి ఎన్ఐటీ తాడేపల్లి గూడెం, విజయవాడకు చెందిన ఎం.అభిలాష్ ఐఐటీ తిరుపతి, గుంటూరుకు చెందిన ఎం.అర్జున్‌కుమార్ సెకెండ్ రౌండ్‌కు దరఖాస్తు, తాళ్లవలసకు చెందిన ఆర్ఎస్ భరద్వాజ ఎన్ఐటీ సిల్చార్, ఎనికేపాడుకు చెందిన జీ.రేష్మిత ఐఐటీ తిరుపతిలో సీట్లు పొందగలిగారు.

మెసేజ్ చేసిన అరగంటలోనే స్పందించారు



ఐఐటీ, మద్రాసు అధికారులు సీటు తిరస్కరించాక ఏం చేయాలో పాలుపోలేదు. మంత్రి నారా లోకేశ్‌కు వాట్సాప్ మెసేజ్ చేశాను. అరగంటలోనే ఆయన స్పందించారు. మా సమస్య పరిష్కారమయ్యే వరకు పేషీ అధికారులను నిరంతరం ఫాలోఅప్ చేస్తూనే వున్నారు. సీటుపై ఆశలు వదులుకున్న సమయంలో మంత్రి లోకేశ్ భగవంతుడిలా వచ్చి అండగా నిలిచారు.

- ఎం.పృథ్వీ సత్యదేవ్, విజయవాడ

భవిష్యత్తుకు భరోసా ఏర్పడింది



కౌన్సెలింగ్ అధికారులు మా మెమోలు తిరస్కరించిన తరువాత భవిష్యత్తు ముగిసిపోయిందని భావించాం. మంత్రి లోకేశ్ దృష్టికి సమస్యను తీసుకువెళ్లినప్పుడు నేనున్నాననే భరోసా కల్పించి అండగా నిలిచారు. నిరంతరం అధికారులతో మాట్లాడి జీవో విడుదల చేయించడం ద్వారా మళ్లీ మా భవిష్యత్తుపై ఆశలు చిగురించేలా చేశారు. నాకు ఎన్ఐటీ, కాలికట్‌లో సీటు వచ్చింది.

- రఘునాథ్‌రెడ్డి, కడప

రాజకీయ నేతలపై గౌరవం పెరిగింది



తమ సమస్యను తన సమస్యగా భావించి మంత్రి లోకేశ్ తీసుకున్న చొరవను చూశాక రాజకీయ నాయకులపై గౌరవం పెరిగింది. తల్లిదండ్రులు నాకు జన్మనిస్తే లోకేశ్ నా జీవితంలో వెలుగులు నింపారు. జీవో ఇచ్చారని తెలియగానే ఉన్నత చదువులకు ఇక ఢోకా లేదనే నమ్మకం కలిగింది. కౌన్సెలింగ్ 3వ రౌండ్‌లోనే ఎంపికయ్యాను. బీటెక్ తరువాత ఎంటెక్ పూర్తిచేసి పేరున్న సంస్థలో ఉద్యోగం సాధించడమే నా లక్ష్యం.

- ఎన్.వెంకట స్నేహిత, నెల్లూరు

లోకేశ్ స్ఫూర్తితో ఉన్నతంగా ఎదుగుతా



మార్కుల జాబితాలో లోపాలపై అధికారులు అభ్యంతరం చెప్పాక మానసికంగా తీవ్ర ఒత్తిడికి గురయ్యాం. సీటు క్యాన్సిల్ అవుతుందేమోనని డీలా పడ్డాం. మంత్రి లోకేశ్ చొరవ చూపి సమస్యను పరిష్కరించడంతో మాకు ధైర్యం వచ్చింది. సీటు వచ్చిందని తెలిశాక మా కుటుంబం మొత్తం ఆనందంలో మునిగిపోయారు. మంత్రి లోకేశ్‌ను స్ఫూర్తిగా తీసుకుని మంచి ఉద్యోగం సాధించి ప్రజలకు సేవ చేస్తాను.

- భరద్వాజనాయుడు, తాళ్లవలస

బీసీ సంక్షేమ సంఘం బలోపేతానికి చర్యలు

- రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు



సమావేశంలో పాల్గొన్న కేసన శంకరరావు, వివిధ జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు

మంగళగిరి, జూలై 7: రాజకీయ పార్టీలకు దీటుగా బీసీ సంక్షేమ సంఘాన్ని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయడానికి అవసరమైన చర్యలు చేపడుతున్నట్టు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు తెలిపారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని బీసీ సంక్షేమ సంఘం కేంద్ర కార్యాలయంలో ఆదివారం రాష్ట్రస్థాయి ముఖ్యనేతలు, వివిధ జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ రాష్ట్ర కార్యవర్గంలో ప్రతి జిల్లా నుంచి ముగ్గుర్ని కోఆప్ట్ చేసుకుంటున్నట్టు చెప్పారు. జిల్లా కార్యవర్గాల్లో మార్పులు, చేర్పులు చేస్తున్నామని, నిర్మాణాత్మకంగా సంఘాన్ని పటిష్ట పరుస్తామని తెలిపారు. అనుబంధ కుల సంఘాలు, విద్యార్థి, యువజన, మహిళా, ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, రైతు అనుబంధ విభాగాలను రాష్ట్ర, జిల్లాస్థాయిలో బలో పేతం చేస్తామన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో గెలుపొందిన శాసనసభ్యులు, పార్లమెంటు సభ్యులు, మంత్రులను సంఘం తరఫున ఘనంగా సన్మానించాలని సమావేశంలో నిర్ణయించినట్టు చెప్పారు. బీసీ ప్రజాప్రతినిధులను ఆ యా జిల్లాల్లో స్థానిక కమిటీ నాయకులు సన్మానించాలని కోరారు. రాష్ట్ర ప్రధానకార్యదర్శి అన్నవరపు నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మహాత్మా జ్యోతిరావు పూలే బీసీభవన్‌ల నిర్మాణం కోసం అన్ని జిల్లాల కలెక్టర్ల కు వినతిపత్రాలు అందజేయాలని, విజయవాడ-గుంటూరు మధ్య ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ఎదురుగా జ్యోతిరావు పూలే, సావిత్రిబాయిపూలే స్మృతివనం ఏర్పాటుచేయాలని ప్రభుత్వాన్ని కోరుతూ సమావేశంలో తీర్మానించడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర సమన్వయకర్త బ్రహ్మానంద శర్మ, యువజన విభాగం అధ్యక్షుడు కుమ్మర క్రాంతికుమార్, సంఘం జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేష్, అధికారప్రతినిధి బాదుగున్నల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

వృత్తివిద్యా కోర్సులు పూర్తిచేసిన వారికి నేడు అప్రెంటీస్ మేళా

గుంటూరు(విద్య), జూలై 7: వృత్తి విద్యాకోర్సులు పూర్తిచేసుకున్నవారికి (బాపట్ల జిల్లా) నిజాంపట్నం ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సోమవారం అప్రెంటీస్‌మేళా నిర్వహిస్తున్నట్లు వృత్తివిద్యా కళాశాల ప్రిన్సిపాల్ (గుంటూరు) ఎన్ ఆనందబాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అప్రెంటీస్ మేళాలో లలితా సూపర్‌స్పెషాల్టీ హాస్పట ల్, అహల్యా నర్సింగ్ హోమ్ సంస్థలు పాల్గొంటాయని తెలిపారు. ఎంపీహెచ్‌డబ్ల్యు, ఎంఎల్‌టీ పూర్తిచేసుకున్న వారు అప్రెంటీస్ మేళాకు హాజరుకావాలని సూచించారు. అప్రెంటీస్‌మేళాలో ఎంపీహెచ్‌డబ్ల్యులో 36, ఎంఎల్‌టీలో 24 ఖాళీలు భర్తీచేస్తారని తెలిపారు. ఎంపికైనవారికి నెలకు రూ.7వేల స్టయిఫండ్ ఇస్తారని తెలిపారు. మేళాకు వచ్చే విద్యార్థులు బయోడేటా, పది, ఇంటర్ విద్యార్హత సర్టిఫికెట్స్, ఆధార్ మూడు సెట్లు, ఆరు ఫొటోలు తీసుకుని రావాలని సూచించారు.

తాడేపల్లిలో గంజాయి విక్రయిస్తున్న ముఠా అరెస్టు

- గంజాయి, కారును సీజ్ చేసిన పోలీసులు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ కళ్యాణ్‌రాజు

తాడేపల్లి టౌన్, జులై 7: ఒరిస్సా సరిహద్దు ప్రాంతం సీలేరు నుండి గంజాయి తెచ్చి విక్రయిస్తున్న ముఠాలోని ఇరువురు సభ్యులను ఆదివారం అరెస్టు చేసి వారి నుండి 2 కిలోల గంజాయిని, కారును స్వాధీనం చేసుకున్నారు. తాడేపల్లి పోలీసు స్టేషన్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో నిందితులను హాజరుపరిచి సీఐ కళ్యాణ్‌రాజు మాట్లాడుతూ తమకు అందిన సమాచారం మేరకు తాను, ఎస్ఐ ప్రతాప్‌కుమార్, సిబ్బందితో తాడేపల్లి రైల్వేగేటు సమీప ప్రాంతానికి వెళ్లగా అక్కడ ఖాళీ ప్రదేశంలో ఏపీ29ఎయు2102 నెంబరు గల కారు పక్కన నిలబడి వున్న ఐదుగురు యువకులు పారిపోతుండగా వారిలో షేక్ సుభాని అలియాస్ పండు, షేక్ ఖాసిం అనే ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారించగా పారిపోయిన అప్పు, రెహమాన్, సాయి కొంతకాలం నుండి వ్యసనాలకు అలవాటు పడి సులువు మార్గంలో డబ్బు సంపాదిద్దామని ఒరిస్సా బోర్డర్ సీలేరు నుండి గంజాయి అమ్మేవారి వద్ద గంజాయి తెచ్చి తాడేపల్లి, మంగళగిరి పరిసర ప్రాంతాల్లో ఎక్కువ ధరకు అమ్మి తద్వారా వచ్చే డబ్బుతో జల్సాలు చేస్తున్నట్టు విచారణలో తేలిందన్నారు. ఈ క్రమంలో నాలుగు రోజుల క్రితం ఐదుగురు సీలేరుకు కారులో వెళ్లి, అక్కడ ప్రసాద్ అనే వ్యక్తి నుండి కేజీ గంజాయి మూడు వేల చొప్పున నాలుగు కేజీల గంజాయి కొనుగోలు చేసి చిన్నచిన్న పొట్లాలు కట్టి విజయవాడ, కృష్ణాకెనాల్ రైల్వేస్టేషన్, మంగళగిరి ప్రాంతాల్లో అమ్మి వాటితో జల్సాలు చేసినట్టు తెలిపారు. మిగిలిన రెండు కేజీల గంజాయిని ఆదివారం మరలా సదరు యువకులు గంజాయి తాగే అలవాటు ఉన్న వారికోసం అమ్మేందుకు వేచి ఉన్నారు. ఈ క్రమంలో షేక్ సుభాని(ప్రకాష్‌నగర్), షేక్ ఖాసిం(నులకపేట)ను అదుపులోకి తీసుకుని వారి వద్ద రెండు కేజీల గంజాయి, కారును స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. ఈ కేసులో పరారీలో ఉన్న ముగ్గురు యువకులను త్వరలో అరెస్టు చేస్తామని, పట్టుకున్న ఇద్దరిని రిమాండ్‌కు తరలిస్తున్నామని చెప్పారు. సమావేశంలో ఎస్ఐ ప్రతాప్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని కాపాడిన అక్షరయోధుడు రామోజీరావు

- ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు



ప్రసంగిస్తున్న ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, వేదిక పైన ఎమ్మెల్యే మాధవి, ఎమ్మెల్సీ లక్ష్మణరావు తదితరులు

గుంటూరు(కార్పొరేషన్), జూలై 7: ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాస్వామ్య వైఫల్యాలపై నిరంతరం యుద్ధం చేసి ప్రజావిజయానికి కృషిచేసిన అక్షరయోధుడు రామోజీరావు అని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు అన్నారు. ఆదివారం గుంటూరులోని శ్రీవెంకటేశ్వర విజ్ఞానమందిరంలో జన చైతన్య వేదిక, ఠాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్ట్‌ల సంయుక్త ఆధ్వర్యంలో రామోజీరావు సంస్మరణ సభ జరిగింది. సభకు జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా లావు శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ నేటి యువత రామోజీరావు నిబద్ధత, దృఢ సంకల్పం, క్రమశిక్షణలను అలవర్చుకోవాలని కోరారు. సమాజ రుగ్మతులపై నిరంతరం పోరాడిన సామాజిక విప్లవకారుడు రామోజీరావు అని అన్నారు. అవనిగడ్డ ఎమ్మెల్యే డాక్టర్ మండలి బుద్ధప్రసాద్ ప్రసంగిస్తూ రామోజీ ఈనాడు, ఈటీవీల ద్వారా తెలుగుభాష ఉద్యమానికి ఎనలేని కృషి చేశారన్నారు. ఇంకా కాంగ్రెస్ పార్టీ మీడియా కమిటీ చైర్మన్ డాక్టర్ ఎస్.తులసిరెడ్డి, వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, ఈనాడు సంపాదకులు ఎం.నాగేశ్వరరావు, ఠాగూర్ మెమోరియల్ థియేటర్ ట్రస్ట్ కార్యదర్శి పి.రామచంద్రరాజు, ఎమ్మెల్యేలు మహమ్మద్ నసీర్ అహ్మద్, గల్లా మాధవి, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డాక్టర్ పి.కృష్ణయ్య, బీజేపీ రాష్ట్ర మీడియా ఇన్‌ఛార్జి పాతూరి నాగభూషణం, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి సభ్యులు వై.వెంకటేశ్వరరావు, మాజీ మంత్రి డొక్కా మాణిక్యవరప్రసాద్, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, హైకోర్టు న్యాయవాది పి.రవితేజ తదితరులు ప్రసంగించారు. కార్యక్రమంలో రామోజీరావు జీవిత విశేషాలను ప్రతిబింబించే ఫొటో ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. తొలుత రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నిమిషం పాటు మౌనం పాటించి శ్రద్ధాంజలి ఘటించారు. రంగం రాజేష్ బృందం రామోజీరావు ప్రాముఖ్యతను వివరించే గేయాలను ఆలపించారు.

కేజేఎస్ఎస్ సేవలు అభినందనీయం

- జీడీసీసీబీ మాజీ అధ్యక్షుడు నల్లపాటి చంద్రశేఖరరావు
- నూతన భవన సముదాయానికి రూ 25 లక్షల విరాళం



నల్లపాటి చంద్రశేఖరరావును సత్కరిస్తున్న పాలకవర్గ సభ్యులు

గుంటూరు (తూర్పు), జూలై 7: పేద, ప్రతిభకల్గిన విద్యార్థినులకు అండగా నిలబడుతున్న కమ్మజన సేవా సమితి సేవలు అభినందనీయమని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు మాజీ అధ్యక్షుడు నల్లపాటి శివరామ చంద్రశేఖరరావు(చంద్రం) అన్నారు. గుంటూరు జేకేసీ రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న భవన సముదాయానికి రూ.25లక్షల విరాళాన్ని ఆయన కుటుంబసభ్యులు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆదివారం నరసరావుపేటలోని ఆయన నివాసంలో చెక్కును సమితి గౌరవ అధ్యక్షుడు వంకాయలపాటి బలరామకృష్ణయ్య, కార్యదర్శి చుక్కపల్లి రమేష్‌లకు అందజేశారు. ఈ సందర్భంగా నల్లపాటి చంద్రం మాట్లాడుతూ అమెరికాలో నివాసముంటున్న తమ కుమారుడు నల్లపాటి వంశీమోహన్ ఈ నిధులను సమకూర్చారని వివరించారు. సమితి కార్యదర్శి చుక్కపల్లి రమేష్ మాట్లాడుతూ దాతలు వారి ఇంటికి పిలిపించుకుని విరాళం అందజేయడం అభినందనీయమన్నారు. రెండు సంవత్సరాల్లో నిర్మాణాన్ని పూర్తిచేసి అందుబాటులోకి తెస్తామన్నారు. అనంతరం నల్లపాటి చంద్రంను పాలకవర్గసభ్యులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది నల్లపాటి లక్ష్మీనారాయణ, పాలకవర్గ సభ్యులు మద్దిపూడి సీతారామయ్య, కన్నెగంటి బుచ్చయ్యచౌదరి, మైనేని సీతారామయ్య, వడ్లమూడి శివరామకృష్ణయ్య పాల్గొన్నారు.

కొత్తగణేశునిపాడులో భారీ చోరీ

- 50 సవర్ల బంగారం, 2.50 లక్షల నగదు, కేజీ వెండి అపహరణ



బాధితులతో మాట్లాడుతున్న సీఐ బాలకృష్ణ, ఎస్ఐ అమీనుద్దీన్

మాచవరం, జూలై 7: మండలంలోని కొత్తగణేశునిపాడు గ్రామంలో శనివారం రాత్రి భారీ చోరీ జరిగింది. గ్రామానికి చెందిన జోగిపర్తి ఆంజనేయులు గృహంలో 50 సవర్ల బంగారం, 2.50 లక్షల నగదు, కేజి వెండి అపహరణకు గురైంది. జోగిపర్తి ఆంజనేయులు తన భార్య ప్రసవం నిమిత్తం ఈ నెల 1వ తేదీన నరసరావుపేట వైద్యశాలకు వెళ్లారు. మధ్యలో ఒకటి, రెండుసార్లు ఆంజనేయులు ఇంటికి వచ్చి వెళ్లాడు. అయితే ఆదివారం ఉదయం బయటి గేటుకు వున్న తాళాలు పగులగొట్టి వుండటంతో గమనించిన ఇరుగుపొరుగు వారు గ్రామంలో వున్న ఆంజనేయులు బంధువులకు విషయాన్ని తెలియజేశారు. వెంటనే వారు వచ్చి సంఘటనా స్థలాన్ని పరిశీలించి విషయాన్ని ఆంజనేయులుకు, మాచవరం పోలీసులకు సమాచారాన్ని చేరవేశారు. విషయం తెలుసుకున్న దాచేపల్లి ఇన్‌చార్జ్ సిఐ బాలకృష్ణ, మాచవరం ఎస్ఐ అమీనుద్దీన్‌లు సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. జరిగిన సంఘటనపై గృహయజమాని ఆంజనేయులును వివరాలు అడిగి తెలుసుకున్నారు. బీరువాలో వున్న 50 సవర్ల బంగారం, 2.50 లక్షల నగదు, కేజి వెండి అపహరణకు గురైనట్లు పోలీసులకు తెలిపాడు. గుర్తుతెలియని వ్యక్తులు అర్ధరాత్రి సమయంలో తాళాలు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించి బీరువాను కూడా పగులగొట్టి ఇంట్లో వున్న వస్తువులను చిందర వందర చేసి దోపిడీకి పాల్పడినట్లు పోలీసులకు వివరించాడు. బాధితుడు ఆంజనేయులు ఫిర్యాదు మేరకు మాచవరం ఎస్ఐ అమీనుద్దీన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సమాచారం అందుకున్న గుంటూరు క్లూస్ టీమ్ సంఘటనా స్థలానికి చేరుకొని వేలిముద్రలు సేకరించారు.

జంగమహేశ్వరపాడులో నాటుబాంబు కలకలం

- భయాందోళనలో గ్రామస్తులు

దుర్గి, జూలై 7: మండలంలోని జంగమహేశ్వరపాడులో ఆదివారం నాటుబాంబు పేలడంతో గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో గురజాల డీఎస్పీ శ్రీనివాసరావు, కారంపూడి సర్కిల్ సీఐ ఆలహరి శ్రీనివాసరావు, ఎస్ఐ కోటయ్య సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జంగమహేశ్వరపాడు గ్రామ శివారులో వంగాల రాఘవరెడ్డి పొలాన్ని గత కొంతకాలంగా కాకిరాల గ్రామానికి చెందిన బొజ్జా నాగేశ్వరరావు కౌలుకు తీసుకొని సాగుచేస్తున్నాడు. ఆదివారం పొలంలో దుక్కి దున్నేందుకు నాగేశ్వరరావు తనతోపాటు తన కుమారుడు నాగేంద్రబాబుతో పొలం చేరుకున్నారు. అనుమానాస్పదంగా కనిపించిన నాటుబాంబును నాగేంద్రబాబు విసిరివేశాడు. ఒక్కసారిగా పేలింది. గ్రామ సమీపంలో పొలం ఉండడంతో ఆ శబ్దానికి ఉలిక్కిపడిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు బాంబు స్క్వాడ్‌ను రప్పించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. గత కొంతకాలంగా ఫ్యాక్షన్ గ్రామంగా పేరొందిన జంగమహేశ్వరపాడు శివారులో బాంబు పేలడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



జంగమహేశ్వరపాడులో పోలీసులు, ఇన్‌సెట్లో నాటుబాంబు పేలిన ప్రదేశం



వెన్నెలకంటి రాఘువయ్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న నసీర్, కార్పొరేటర్ సమత

గిరిజనుల ఆరాధ్య దైవం 'వెన్నెలకంటి రాఘవయ్య'

● తూర్పు ఎమ్మెల్యే నసీర్

గుంటూరు(తూర్పు), జూలై 7: గిరిజనుల హక్కుల కోసం పోరాడి, వారి జీవితాల్లో వెలుగులు నింపిన యోధుడు వెన్నెలకంటి రాఘవయ్య అని తూర్పు ఎమ్మెల్యే నసీర్ కొనియాడారు. స్థానిక నాజ్ సెంటర్ కూడలిలో ఏర్పాటు చేసిన వెన్నెలకంటి రాఘవయ్య విగ్రహాన్ని ఆదివారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం నసీర్ మాట్లాడుతూ గిరిజనుల పట్ల శాపంగా మారిన అతిభయంకర, క్రూరమైన 1871 ట్రైబల్ యాక్టు రద్దులో వెన్నెలకంటి కీలకపాత్ర పోషించారని గుర్తు చేశారు. పెన్నా, కృష్ణా నీటి పారుదల ప్రాజెక్టుల రూపకల్పనలో ఆయన కృషి ఎనలేనదని అన్నారు. అటువంటి వ్యక్తికి గుంటూరులో విగ్రహాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. యానాది అభివృద్ధి, సంక్షేమ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బాపట్ల ఏసుబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కే ఏడుకొండలు, కృష్ణనాయక్, కస్తూరి సైదులు, బ్రహ్మయ్య, బీసీ నాయకులు అంగిరేకుల వరప్రసాదు, కార్పొరేటర్ సమత తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ హైస్కూళ్లల్లో టీచర్లను నియమించాలి

గుంటూరు(విద్య), జూలై 7: నగరంలోని కార్పొరేషన్ పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్లను నియమించాలని యూటీఎఫ్ నగర అధ్యక్ష, కార్యద ర్శులు ఎం చిన్నయ్య, కె.ప్రభుజీ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నగరంలోని స్వర్ణాంధ్రనగర్, భారత్‌పేట, గుజ్జనగుండ్ల, వెంగళరావునగర్, కేవీపీ కాలనీల్లో పాఠశాలల్ని అప్‌గ్రేడ్ చేశారని తెలిపారు. ఆయా పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్ల కొరత వల్ల ఇబ్బందులు వస్తున్నాయని తెలిపారు. వెంటనే టీచర్ల నియామకం కోసం చర్యలు తీసుకోవాలని కోరారు.

వెబ్‌సైట్‌లో మున్సిపల్ ఉపాధ్యాయుల పదోన్నతుల జాబితా

జిల్లాలోని మున్సిపల్, కార్పొరేషన్ పాఠశాలల్లో పనిచేస్తున్న సెకండరీగ్రేడ్, లాంగ్వేజ్ పండిట్స్ స్కూల్ అసిస్టెంట్‌స పదోన్నతల జాబితా వెబ్‌సైట్ ఉందని డీఈవో పి.శైలజ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించిన అర్హతలపై అభ్యంతరాలు ఉంటే ఈనెల 10లోగా లిఖిత పూర్వకంగా తెలియజేయాలని సూచించారు. ఇతర వివరాల్లజీ deognt.blogspot.in అనే వెబ్‌సైట్‌లో చూడాలని సూచించారు.

మొక్కల సంరక్షణలో స్కౌట్స్‌అండ్‌గైడ్స్ విద్యార్థులు కీలకం



మొక్కలు పంపిణీ చేస్తున్న రవీంద్రనాథ్‌రెడ్డి

గుంటూరు(విద్య), జూలై 7: మొక్కలు నాటడం వాటిని సంరక్షించడంలో స్కౌట్స్ అండ్ గైడ్స్ విద్యార్థులు కీలక భూమిక పోషించాలని రాష్ట్ర పాఠ్యపుస్తకాల సంచాలకులు రవీంద్రనాథ్‌రెడ్డి సూచించారు. ఆదివారం భారత్ స్కౌట్ అండ్ గైడ్ ఆధ్వర్యంలో సెయింట్ జోసెఫ్ బీఎడ్ కళాశాలలో ఏర్పాటు చేసిన 'వనమహోత్సవం' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మొక్కల పెంపకంపై విద్యార్థుల్లో చైతన్యం తీసుకురావాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ స్వరూపరాణి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రాముఖ్యతను గురించి ప్రజలకు వివరించి ప్రతి పుట్టినరోజు వంటి అన్ని సందర్భాల్లో మొక్కలని పంపిణీ చేయాలని సూచించారు. కార్యదర్శి కరస్పాండెంట్ సిస్టర్ రోజ్లీనా, స్కౌట్స్‌అండ్ గైడ్స్ ప్రతినిధి శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శి ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.


మందకృష్ణ మాదిగ పోరాటాలు వెలకట్టలేనివి

● స్వర్ణాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఏసుబాబు



మాట్లాడుతున్న ఏసుబాబుమాదిగ, పాల్గొన్న సంఘ సభ్యులు

గుంటూరు(తూర్పు), జూన్ 7: ఎస్సీ వర్గీకరణ, అలాగే సమన్యాయం కోసం దళితులను ఐక్యం చేయడానికి మంద కృష్ణమాదిగ చేసిన పోరాటాలు వెలకట్టలేనివని స్వర్ణాంధ్ర ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఏసుబాబు మాదిగ అన్నారు. ఆదివారం స్థానిక అన్నపూర్ణ కాంప్లెక్స్‌లోని సంఘ కార్యాలయంలో ఏమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ, మందకృష్ణ మాదిగ పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో దండోరా ఉద్యమం తెచ్చిన కొత్త ప్రశ్నలు, పోరాటాలు రూపాలు, విలువలు అప్పటికే నిర్మాణమైన దళిత ఉద్యమ అవగాహన పరిధిని తాత్వికంగా విస్తృత పరిచిందని గుర్తుచేశారు. ముఖ్యంగా ఎస్సీ వర్గీకరణ ఉద్యమానికి చైతన్యాన్ని అందించిందని అన్నారు. మొత్తం దేశంలో సరికొత్త చర్చను పెట్టి కులనిర్మూలన, పూలే-అంబేద్కర్ ఉద్యమాలు, నేడు దళితుల్లో అత్యధికంగా వెనుకబడిన ఎస్సీ కులాల అనుభవం, హక్కులు, వాటాల పునాదిగా నిర్మాణం కావాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పిందని వివరించారు. కార్యక్రమంలో సుబ్బయ్య మక్కెన ప్రభాకర్, ప్రసాదు, రమణ, షేక్ మస్తాన్ పాల్గొన్నారు.



పదవీ విరమణ చేసిన అధికారులను సత్కరిస్తున్న అసోసియేషన్ నాయకులు

వైసీపీ హయాంలో విద్యుత్ ఉద్యోగులకు పీఆర్‌సీలో అన్యాయాన్ని సవరించాలి

● ఏపీ పవర్ డిప్లమా ఇంజనీర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శేషారెడ్డి

గుంటూరు, జూలై 7 : గత వైసీపీ ప్రభుత్వ హయాంలో పీఆర్‌సీ విద్యుత్ ఉద్యోగులకు జరిగిన తీరని అన్యాయాన్ని సవరించేలా కూటమి ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళతామని ఆంధ్రప్రదేశ్ పవర్ డిప్లొమా ఇంజనీర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేవీ శేషారెడ్డి అన్నారు. విద్యుత్ శాఖలో వివిధ హోదాల్లో పనిచేసి పదవీ విరమణ చేసిన 8 మంది అధికారులకు అసోసియేషన్ ఆధ్వర్యంలో జీటీ రోడ్డులోని ఏ 1 కన్వెన్షన్ హాల్లో ఆదివారం సన్మాన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ పీఆర్‌సీలో ఉద్యోగులకు తీరని అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని ప్రస్తుత ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్ళి న్యాయం జరిగేలా ప్రయత్నం చేద్దామన్నారు. అలానే రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఇంజనీర్, సబ్ ఇంజనీర్ పోస్టులను వెంటనే భర్తీ చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రస్తుత సిబ్బందిపై పనిభారం అధికమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గుంటూరు, సీఆర్‌డిఏ సర్కిల్ ఆపరేషన్ ఎస్ఈలు ఆవుల మురళీకృష్ణయాదవ్, ప్రత్తిపాటి విజయ్‌కుమార్, అసోసియేషన్ సలహాదారు కె.రవిశేఖర్, వర్కింగ్ ప్రెసిడెంట్ పి.హుస్సేన్‌ఖాన్, ఎ.గురునాధరావు పలువురు నాయకులు హాజరయ్యారు.



కొరిటెపాడు వాకింగ్ ట్రాక్‌లో పైప్ లైన్ లీకు ద్వారా వస్తున్న నీరు ట్రాక్‌లోకి రావడంతో వాకర్స్‌కు అసౌకర్యంగా ఉంది. వాకింగ్ చేసే వారికి ఇబ్బందికరంగా ఉండటంతో తక్షణమే లీకును అరికట్టాలని.. వాకర్స్‌కి ఇబ్బంది లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. - గుంటూరు(కార్పొరేషన్)

ఫిట్‌నెస్ 'మాయ'..!

● ఆటోనగర్లో తయారైన లారీ ఛాసిస్‌లకు ఫిట్‌నెస్ జారీ
● ఒక్కో లారీకి రూ.10 వేల వరకూ వసూళ్లు..
● నిబంధనలకు విరుద్ధంగా సర్టిఫికెట్ ఇస్తున్నారనే విమర్శలు
● మిర్చియార్డులో లారీ యూనియన్ల రచ్చలో వాస్తవాలు వెలుగులోకి



లారీ ఛాసిస్‌ను 5 అడుగుల మేర పెంచిన దృశ్యం

గుంటూరు(తూర్పు), జూలై 7: ఫిట్‌నెస్ సర్టిఫికెట్ విషయంలో జిల్లా రవాణశాఖ అధికారులు నిబంధనలకు విరుద్ధంగా పనిచేస్తున్నారు. ముఖ్యంగా లారీ బాడీ(ఛాసిస్) విషయంలో చూసీచూడనట్టుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. మిర్చియార్డులో ఈ మధ్య లారీ యూనియన్ల మధ్య జరుగుతున్న రచ్చలో లారీ ఛాసిస్ ఫిట్‌నెస్ విషయంలో వాస్తవాలు బయటకు వచ్చాయి. కేంద్ర మార్గదర్శకాలకు అనుగుణంగా రూపొందించిన వాహనానికి.. గుంటూరు ఆటోనగర్లో తయారు చేసిన లారీఛాసిస్‌ల విషయంలో ఒకేవిధంగా ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు రవాణ శాఖ అధికారులు జారీ చేస్తున్నారు. కృత్రిమంగా ఏర్పాటు చేసుకున్న ఛాసిస్‌కు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ ఎలా జారీ చేస్తున్నారని కొంతమంది లారీ యాజమాన్లు ప్రశ్నిస్తున్నారు. వైసీపీ నాయకుల ఆదేశాలతో రవాణా శాఖ అధికారులు సర్టిఫికెట్లు జారీ చేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

అసలేం జరిగింది

30 టన్నుల సామర్థ్యం కలిగిన లారీలకు మాత్రమే బాడుగ ఇస్తామని మిర్చియార్డులో వైసీపీ నాయకుల అండతో లారీ యూనియన్లకు అనధికార ఆదేశాలు జారీ చేశారు. దీని వెనుక గతంలో టీడీపీ జాతీయ కార్యాలయంపై దాడిచేసి అరెస్టయిన వైసీపీ నాయకుడు ఉన్నాడనే విషయం అందరికీ తెలిసిందే. దీంతో 20-25 టన్నుల సామర్థ్యం ఉన్న లారీలను లారీ యజమానులు వెంటనే 30 టన్నులుగా (30 అడుగులు) ఛాసిస్‌ను మార్చుకున్నారు. దీంతో గతంలో ఉన్న దానికంటే 5 అడుగుల మేర పెంచుకున్నారు. అంతేగాక రవాణా శాఖ అధికారుల సాయంతో ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేయించుకున్నారు.

నియమాలకు విరుద్ధంగా..

వాస్తవానికి ఇలా అదనపు ఛాసిస్ ఏర్పాటు చేసుకున్న వాహనాలకు ఫిట్‌నెస్ జారీ చేయకూడదని నియమాలు ఉన్నాయి. కేవలం కేంద్ర నియమాలకు అనుగుణంగా రూపొందించిన లారీల సామర్థ్యాన్ని బట్టి ఫిట్నెస్ సర్టిఫికెట్ జారీ చేస్తారు. ఫిట్‌నెస్ విషయంలో మిగిలిన జిల్లా రవాణా శాఖ అధికారులు కఠినంగా వ్యవహరిస్తున్నారు. కానీ జిల్లా రవాణా శాఖ అధికారులు నిబంధనలను యథేచ్ఛగా ఉల్లంఘించారు. దీంతో మిర్చియార్డులో దాదాపు 500-600 వాహనాలకు ఇటువంటి సర్టిఫికెట్లు పొందారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అసలు ఛాసిస్ పొడవు, వెడల్పు, సామర్థ్యం, లారీ టైర్ల మధ్య దూరం తెలుసుకోకుండా ఈ సర్టిఫికెట్లు జారీ చేసారనే ఆరోపణలు వస్తున్నాయి. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేస్తే ఒక లారీకి అధికారులు దాదాపు రూ.10 వేలు వసూలు చేస్తున్నారని విమర్శలు వినబడుతున్నాయి.

వాస్తవాలు వెలుగులోకి..

మిర్చియార్డులో లారీ యూనియన్ల మధ్య జరుగుతున్న వివాదంపై నూతన ప్రభుత్వం, ఉన్నతాధికారులు దృష్టి సారించారు. యార్డులో ఎన్ని యూనియన్లు ఉన్నాయి.. ఎన్ని లారీలు తిరుగుతున్నాయి... ఇతర రాష్ట్రాలకు ఎన్ని లారీలు వెళ్తున్నాయనే విషయంపై ఆరా తీశారు. అధికంగా వైసీపీ నాయకులకు చెందిన లారీలు ఉన్నాయని నిర్ధారణకు వచ్చారు. అంతేగాక లారీలకు సంబంధించిన ధ్రువీకరణ పత్రాలపై ప్రత్యేక దృష్టి సారించింది. దీంతో ఫిట్‌నెస్ సర్టిఫికెట్ పరిశీలించగా అసలు వాస్తవాలు వెలుగులోకి వచ్చాయి. అంతేగాక 13 అడుగుల ఎత్తు మించి లోడు చేయకూడదనే నిబంధనను ఉల్లంఘిస్తున్నారనే విషయాన్ని గుర్తించారు. 13 అడుగుల కంటే ఎక్కువగా లోడ్ చేస్తే టన్నుకు రూ.20 వేల జరిమానా వేయాలని, దానిని కూడా రవాణ శాఖ అధికారులు అమలు చేయలేదని, అసలు ఒక్క కేసు కూడా నమోదు చేయలేదని గుర్తించారు. అంతేగాక సామర్థ్యానికి మించి లోడ్ తీసుకోవడంతో తరుచుగా ప్రమాదాలకు జరుగుతున్నాయని గుర్తించారు.

వైసీపీ హయాంలోనే..

అప్పటి ఉమ్మడి జిల్లాలో రవాణా ఉన్నతాధికారి ఆధ్వర్యంలో ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేశారనే విమర్శలు వినిపిస్తున్నాయి. జగన్‌కు అంటకాగిన గుర్తింపు పొందిన రవాణా అధికారి గతంలో అనంతపురం జేసీ దివాకర్ ట్రావెల్స్‌పై, అలాగే ఉమ్మడి జిల్లాల్లో పల్నాడు ప్రాంతానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడికి చెందిన ద్విచక్ర వాహనాల షోరూంపై అక్రమ కేసులు నమోదు చేసాడని.. ఇప్పుడు వైసీపీ నాయకులకు చెందిన లారీలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ చేశాడనే ఆరోపణలు వస్తున్నాయి. ప్రస్తుతం కొంత మంది అధికారులు దీనిని కొనసాగిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీలపై సమగ్ర విచారణ చేయాలని కొంతమంది లారీ యూనియన్లు విజ్ఞప్తి చేస్తున్నాయి.

విద్య ద్వారానే విశ్వబ్రాహ్మణుల అభ్యున్నతి

● విశ్రాంత అధ్యాపకులు కందేపి సురేంద్రనాథ్



విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ చేస్తున్న సురేంద్రనాథ్

గుంటూరు(విద్య), జూలై 7: సృష్టికర్త విశ్వకర్మ వారసులుగా మానవ నాగరిక సమాజానికి కావలసిన అన్ని రకాల పనిముట్లను అందించిన విశ్వబ్రాహ్మణులు ఆధునిక సమాజంలో మనుగడ సాధించాలంటే పండిత గానాల రామమూర్తి స్ఫూర్తితో విద్యావంతులవడం తప్పనిసరి అని విశ్రాంత అధ్యాపకులు ఆచార్య కందేపి సురేంద్రనాథ్ అన్నారు. ఆదివారం స్థానిక అరండల్‌పేట విశ్వబ్రాహ్మణ కళ్యాణ మండపంలో విశ్వకర్మ పేద విద్యార్థి సంక్షేమ సంఘం 27వ వార్షిక వేడుకలు ఘనంగా నిర్వహించారు. నగరంలోని దయా హృదయ సేవా సమితి అధ్యక్షుడు అమృతలూరి వీరబ్రహ్మేంద్రరావు, స్వర్ణ శిల్పి శంభాన వీరభద్రాచారి, లఘు చిత్రాల నిర్మాత, దర్శకులు గన్నే వాసు దేవరావు, విశ్రాంత ఉపాధ్యాయులు సీహెచ్ వెంకట వసంతరావులను ఘనంగా సన్మానించిన అనంతరం పాఠశాలల, కళాశాలల విద్యార్థులకు ఉపకార వేతనాలు, నోటు పుస్తకాలు, ఇతర విద్యా ఉపకరణాలు అందజేశారు. ఈ సందర్భంగా సంక్షేమ సంఘం వ్యవస్థాపకులు గోనుగుంట్ల శేషగిరిరావు మాట్లాడుతూ 27 సంవత్సరాలుగా దాతల సహకారంతో నగరంలోని పేద విశ్వబ్రాహ్మణ విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలియజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు పట్నాల శివప్రసాద్, దుగ్గిరాల సబ్ రిజిస్ట్రార్ అద్దంకి నవకుమార్, సంఘ కార్యదర్శి కటేవరపు కృష్ణారావు, కోశాధికారి చిర్రావూరి సుధీర్ బాబు, ఇంజనీర్ కందేపి వెంకటరావు, తదితరులు పాల్గొన్నారు.

బీకాం జనరల్ కోర్సును అన్ని ప్రభుత్వ కళాశాలల్లో కొనసాగించాలి

● ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి బందెల నాసర్‌జీ

గుంటూరు(తూర్పు), జూలై 7: ప్రభుత్వం డిగ్రీ ప్రవేశాల్లో విడుదల చేసిన బీకామ్ జనరల్ కోర్సు నోటిఫికేషన్లో కొన్ని కళాశాలలకు మాత్రమే ప్రవేశాలు కల్పించడంపై ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్య దర్శి బందెల నాసర్‌జీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం స్థానిక కొత్తపేట మల్లయ్య లింగంభవన్‌లో అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 150కి పైగా డిగ్రీ కళాశాలలుంటే కేవలం 42 కళాశాల్లోనే ఈ కోర్సును ఉంచడం బాధకరమని అన్నారు. నూతన ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించు కోవాలని అన్నారు. ఈనెల 10వ తేదీ నుంచి డిగ్రీ ప్రవేశాలకు కౌన్సెలింగ్ జరుగుతున్న సందర్భంగా ఈ నిర్ణయాన్ని పునఃసమీక్ష చేయాలని కోరారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ నగర కార్యదర్శి యశ్వంత్, దేవేంద్ర, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

నూతన క్రిమినల్ చట్టాలను రద్దు చేయాలి : జంగాల

గుంటూరు(తూర్పు), జూలై 7: నూతనంగా కేంద్రం తీసుకొచ్చిన క్రిమినల్ చట్టాలను తక్షణమే రద్దు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక మల్లయ్య లింగం భవన్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా జనరల్ బాడీ సమావేశం మహేంద్ర అధ్యక్షతన జరిగింది. ఈ సమా వేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన జంగాల అజయ్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టాలు భవిష్యత్తులో అభివృద్ధికి అవరోధంగా మారతాయని అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య మాట్లాడుతూ రాష్ట్రంలో లక్షలాది మంది కళాకారులు వీధిన పడకుండా గ్రామీణ జానపద పౌరాణిక ఔత్సాహిక కళాకారులందరికి సంక్షేమ బోర్డు ఏర్పాటు కోసం ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. కళాకారులు అందరికీ ప్రభుత్వ గుర్తింపు కార్డులు, ఇంటి స్థలాలు, ఉచిత బస్సు పాసులు మంజూరు చేయాలని అన్నారు. సమావేశంలో ప్రజానాట్యమండలి జిల్లా కార్య దర్శి ఆరేటి రామారావు. గని, పున్నయ్య. దేవరకొండ శ్రీనివాసులు, జంపరి గోవిందరాజు, ఒంగోలు రాంబాబు పాల్గొన్నారు.

కష్టపడి పని చేసే వారికి జనసేన పార్టీలో పెద్దపీట

● ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్ వెల్లడి



ఎమ్మెల్సీ హరిప్రసాద్‌ను సత్కరిస్తున్న పార్టీ నేతలు

గుంటూరు, జూలై 7: పార్టీపై నమ్మకం, విధేయత, అంకితభావంతో పని చేయడం ద్వారా జనసేన అధినేత పవన్ కల్యాణ్ మనసు గెలుచుకోవచ్చని పవన్‌కల్యాణ్ రాజకీయ కార్యదర్శి, శాసనమండలి సభ్యుడు పిడుగు హరిప్రసాద్ తెలిపారు. ఎమ్మెల్యే కోటాలో జనసేన పార్టీ నుంచి శాసన మండలి సభ్య డుగా నియమితులైన హరిప్రసాద్‌ను ఆది వారం జిల్లా జనసేన అధికార ప్రతినిధి ఆళ్ల హరి ఆధ్వర్యంలో పార్టీ నాయకులు ఘనంగా సత్కరించారు. ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణుడు బీవీ పట్టాభిరామ్ రచించిన చాణక్య తంత్రం పుస్తకాన్ని జనసేన నాయకులు సయ్యద్ షర్ఫుద్దీన్, నాజర్‌వలి, గడ్డం రోశయ్య, ఆయకు బహూకరిం చారు. ఈ సందర్భంగా హరిప్రసాద్ మాట్లాడుతూ పార్టీ కోసం నిజాయితీగా కష్టపడి పని చేసే ప్రతి కార్యకర్తను గుండెల్లో పెట్టుకొని చూసే నాయకుడు పవన్ కల్యాణ్ అని తెలిపారు. ఎంతో ఉన్నతమైన బాధ్యతతో ఎమ్మెల్సీగా తనకు అవ కాశం ఇచ్చిన జనసేనానికి కృతజ్ఞుడి గా ఉంటానని పిడుగు హరిప్రసాద్ తెలిపారు. కార్యక్రమంలో జనసేన నాయకులు రఫి, ఫణి, హేమంత్, అశోక్‌రెడ్డి, సాయి తదితరులు పాల్గొన్నారు.

నేస్తం స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయం

● ఐఏఎస్ అధికారి అద్దంకి శ్రీధర్‌బాబు



ప్రసంగిస్తున్న డాక్టర్ అద్దంకి శ్రీధర్‌బాబు

గుంటూరు (మెడికల్) జూలై 7: నేస్తం స్వచ్ఛంద సంస్థ చేపడు తున్న సేవా కార్యక్రమాలు అభినందనీయమని ఐఏఎస్ అధికారి డాక్టర్ అద్దంకి శ్రీధర్ బాబు కొనియాడారు. ఆదివారం గుంటూరు పెన్షనర్స్ అసోసియేషన్ హాల్లో జరిగిన 'నేస్తం' మొదటి వార్షికోత్సవ సభలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఎక్కువ మంది శ్రేయోభిలాషులు ఉన్న వారే అసలైన ధనవంతులని డాక్టర్ శ్రీధర్ బాబు తెలిపారు. కౌండిన్య ఎడ్యుకేషన్ ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ ఈవీ నారాయణ మాట్లాడుతూ సమాజంలో మనం ప్రతి ఒక్కరికి రుణపడి ఉన్నామనే భావనతో సేవ చేయాలని తెలిపారు. నేస్తం సహ వ్యవస్థాపకుడు టీ.ధనుంజయరెడ్డి మాట్లాడుతూ కష్టాన్ని గుర్తించే నేత్రం, కన్నీటిని తుడిచే హస్తం మా నేస్తం అని తెలిపారు. గౌరవ అతిథులుగా హాజరైన డాక్టర్ జొన్నలగడ్డ యాస్మిన్, డాక్టర్ రేవూరి హరికృష్ణ, జీ సాయికృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ నేస్తం చేప డుతున్న పలు సేవా కార్యక్రమాల్లో తాము కూడా భాగస్వామ్యులై నందుకు ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా నగరంలో పిల్లల కు, వృద్ధులకు నిస్వార్థంగా సేవలు అందిస్తున్న అనాథశ్రమ, వృద్ధాశ్ర మ నిర్వాహకులను ఈ వేదికపై సత్కరించారు. కార్యక్రమంలో నేస్తం సభ్యులు త్రిపుర సుందరరావు, కే రమణ, కే సత్యనారాయణ, శ్రీని వాస్, గోపాల్, చంద్రశేఖర్‌రెడ్డి, కన్నారెడ్డి పాల్గొన్నారు.

ప్రజా ప్రభుత్వంపై జగన్ విమర్శలు సరికాదు

ప్రజల ఆశలకు అనుగుణంగానే చంద్రబాబు పాలన

● టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ధారూనాయక్

గుంటూరు, జూలై 7 : ప్రజా ప్రభుత్వంపై జగన్ విమర్శలు ఏ మాత్రం సమర్థనీయం కాదని, రాష్ట్రంలో ప్రజల ఆశలకు అనుగుణంగానే చంద్రబాబు పాలన ఉంటుందని టీడీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.ధారూ నాయక్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఇక్కడ విలేఖరులతో మాట్లాడుతూ గడిచిన ఐదేళ్లలో రాష్ట్రం సర్వనాశనం అయిందని, అన్ని రంగాల్లో రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించారని ఆందోళన వ్యక్తం చేసారు. ఎన్నికల ఫలితాలు వచ్చిన నెల రోజులకే చంద్రబాబుపై ఏడుపులు, పెడబొబ్బలతో శాపనార్థాలు పెట్టడం మానుకోవాలని ధారూనాయక్ హితవు పలికారు. దశాబ్ద కాలంగా పెండింగ్‌లో ఉన్న రాష్ట్ర విభజన సమస్యలతో పాటు పునర్విభజన చట్టంలోని అంశాలపై ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం జరుగుతుంటే తట్టుకోలేని జగన్ అవాకులు, చవాకులు పేలుతున్నారన్నారు. వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం అరాచక శక్తులతో పేట్రేగిపోయిందన్నారు. జగన్ తాడేపల్లి ప్యాలెస్‌లో కూర్చొని పరదాలు కట్టుకొని లక్షల కోట్లు దోపిడీ చేసి రాష్ట్రాన్ని సర్వనాశనం చేసారని ఆరోపించారు. ఇచ్చిన మాట ప్రకారం జూలై నెల ఒకటో తేదీన అవ్వ, తాతలకు రూ.4 వేల పెన్షన్‌ను అందించి మరోసారి పేదల ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు ప్రజల గుండెల్లో నిలిచిపోయారని అన్నారు. టీడీపీ ప్రభుత్వం ఏర్పడి నెల రోజులు గడిచినా తమ నాయకులపై అరాచకాలు సృష్టిస్తూనే ఉన్నారన్నారు. అయినా సరే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చట్టపరంగానే చర్యలు తీసుకుంటున్నారే తప్ప ప్రతి చర్యకు ఏమాత్రం పాల్పడలేదన్నారు.

ఆకట్టుకున్న భక్తిగీతాలాపన

గుంటూరు(తూర్పు), జూలై 7: స్థానిక బృందావన్ గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళ్యాణవేదికపై ఆదివా రం ఇమ్మడి అంజనీదేవి బృందం వారిచే భక్తిమాల గ్రంథమాలికలోని గీతాలాపన గానం కార్యక్రమం జరిగింది. తొలుత ఆలయ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అంజనీదేవి బృందం తొలుత గణేశ గీతంతో ప్రారంభించి పలు భక్తి గీతాలను ఆలపించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. కీబోర్డుపై సాయి, తబలపై వెంకట్ వాయిద్య సహకారం అందించారు.

వైద్య శిబిరానికి అనూహ్య స్పందన

గుంటూరు(తూర్పు), జూలై 7 : గుంటూరు రూరల్ మండలం, జొన్నలగడ్డలో సంగాపు సుబ్బమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరానికి అనూహ్య స్పందన లభించింది. ప్రముఖ వైద్యులు ఆళ్ల సిద్ధార్థ రెడ్డి, తేజస్వీ, సౌమ్య, అబ్దుల్ ఖాన్ పాల్గొని వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్ర మంలో గ్రామ ఉప సర్పంచ్ వంగా నవీన్‌రెడ్డి, ట్రస్ట్ సభ్యులు పెనుమూడి వెంకటేశ్వరరావు, గూడూరి సాంబశివరావు, తుమ్మలపూడి శ్రీనివాసరెడ్డి, కృషి విజ్ఞానకేంద్ర విద్యార్థినులు పాల్గొన్నారు.

ప్రజల సంకల్పంతోనే ఎన్డీయే కూటమి ఘన విజయం

● ఎమ్మెల్యే గల్లా మాధవి



జెండా ఊపి పాదయాత్రను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గల్లా మాధవి

గుంటూరు, జూలై 7(ఆంధ్రజ్యోతి): ప్రజల సంకల్పంతోనే ఎన్డీఏ కూటమి ఘన విజయం సాధించిందని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గల్లా మాధవి అన్నారు. రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి తిరుగులేని విజయాన్ని పొంది అధికారంలోకి రావడంతో నియోజకవర్గం 33వ డివి జన్‌కు చెందిన టీడీపీ నేత పొరెళ్ళ బసవేశ్వరరావు గుంటూరు బ్రాడీపేట నుంచి మంగళగిరిలోని పానకాల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం వరకు విజయోత్సవ పాదయాత్ర చేపట్టారు. ఆ పాదయాత్రను ఎమ్మెల్యే గల్లా మాధవి జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సైకో మనస్తత్వం కలిగిన జగన్‌రెడ్డిని గద్దె దింపటానికి రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు గట్టి సంకల్పం తీసుకోవటం వల్లే చంద్రబాబు వంటి దార్శనికుడు ముఖ్యమంత్రి అయ్యారన్నారు. పాదయాత్ర చేపట్టిన నేతలను ఆమె అభినందించారు. కార్యక్రమంలో పోపూరి నరేంద్ర, ఈరంటి వరప్రసాద్, చింతకాయల శివ, వినోద్, నాగరాజు, డేగల శ్రీను, ప్రశాంత్, గోపి తదితరులు పాల్గొన్నారు.

● గుంటూరు 18వ డివిజన్ ఆర్ అగ్రహారంలో మార్వాడీ దేవాలయం ప్రతిష్ఠ కార్యక్రమానికి ఎమ్మెల్యే గల్లా మాధవి హాజరయ్యారు.

అమరావతి పనులు త్వరగా ప్రారంభించాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు



మాట్లాడుతున్న పాశం రామారావు

గుంటూరు(తూర్పు), జూలై 7: రాష్ట్ర ప్రభుత్వం రాజధాని నిర్మాణానికి నిధులు కేటాయించి త్వరగా పనులు ప్రారంభించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు కోరారు. బ్రాడిపేటలోని షైనేని భవన్‌లో జరిగిన జిల్లా స్థాయి కార్యకర్తల శిక్షణా తరగతులు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ రాజధానికి భూములిచ్చిన రైతులకు కౌలు చెల్లించాలని, కౌలు చెల్లించే కాలపరిమితిని పెంచాలని కోరారు. రాజధాని సీడ్ యాక్సిస్ రోడ్డు నిర్మాణంలో భూములు సేకరించే రైతులకు ప్యాకేజీని పెంచాలని కోరారు. వ్యవసాయ సీజన్‌లో ఎరువులు, విత్తనాలు రైతు భరోసా కేంద్రాల్లో అందు బాటులో ఉంచాలని అన్నారు. రాష్ట్ర నాయకులు ఆర్ రఘు మాట్లాడుతూ భారత రాజ్యాంగంలో పొందు పరిచిన క్రిమినల్ చట్టాలలో మార్పులు చేసి ప్రజా ఉద్యమాలను, ఉద్యమకారులను అణిచే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ విధానాలకు వ్యతిరేకంగా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగించేందుకు నిధులు కేటాయించాలని, ప్రభుత్వ భూముల్లో నివాసముంటున్న పేదలకు జిల్లా వ్యాప్తంగా ఇళ్ళ పట్టాలివ్వాలని సమావేశం తీర్మానించింది. సమావేశంలో సీపీఎం జిల్లా నాయకులు ఈమని అప్పారావు, వై నేతాజి, ఎస్ఎస్ చెంగయ్య, ఎం రవి, ఎల్ అరుణ, బీ.కోటేశ్వరి, జొన్నా శివశంకరరావు, జేవీ రాఘవులు తదితరులు పాల్గొన్నారు.

దిక్సూచి DIKSUCHI

జాతీయ అత్యవసర పరిస్థితి (1975)

ఒక సమగ్ర అవగాహన

ఇటీవల 18వ లోక్‌సభ కొలువుతీరిన తొలి రోజున భారతదేశంలో జాతీయ అత్యవసర పరిస్థితి విధించి 49 ఏళ్లు కావస్తున్న సందర్భంగా ప్రధాని ఆనాటి దుర్భర పరిస్థితులకు వ్యతిరేకంగా పోరాడిన యోధులకు నివాళి అర్పించారు. అదేవిధంగా స్పీకర్ ఒక తీర్మానాన్ని ప్రవేశపెడుతూ 1975 నాటి అత్యవసర పరిస్థితి కాలాన్ని భారతదేశ చరిత్రలో చీకటి అధ్యాయంగా వర్ణించారు. సభలో ప్రతిపక్షాల నిరసనల మధ్య సభ వాయిదా పడింది. ఈ సంఘటన 1975 నాటి జాతీయ అత్యవసర పరిస్థితిపై దేశప్రజలందరూ దృష్టిసారించేలా చేసింది. ఈ నేపథ్యంలో 1975 నాటి జాతీయ అత్యవసర పరిస్థితి విధింపునకు కారణాలు, ఎమర్జెన్సీ కాలపు నిరంకుశ పద్ధతులు, రాజ్యాంగ సవరణలు, తదనంతర కాలంలో తీసుకొచ్చిన రాజ్యాంగ మార్పులు తదితర అంశాలపై అవగాహన అవశ్యకం.

భారత రాజ్యాంగంలో అత్యవసర పరిస్థితి నిబంధనల చేర్పు

ఏవైనా అంతర్గత లేదా బాహ్య కారణాలు లేదంటే ఆర్థిక పరిస్థితుల కారణంగా దేశ భద్రత, ఐక్యత, సమగ్రతలకు భంగం వాటిల్లే అవకాశం ఉంటే ఆ పరిస్థితులనే అత్యవసర పరిస్థితులుగా పరిగణిస్తారు. వీటిని ఎదుర్కొనడానికి, దేశాన్ని ఏకతాటిపై ఉంచడానికి కేంద్రానికి ప్రత్యేక అధికారాలు అవసరమని, ఆ అధికారాలను రాజ్యాంగ నిబంధనల పరంగా అందించాలని డా.బీ.ఆర్. అంబేద్కర్, టీ.టీ.కృష్ణమాచారి, అల్లాడి కృష్ణస్వామి అయ్యర్ వంటి న్యాయ కోవిదులు రాజ్యాంగ రచన సమయంలో భావించారు. ఈ అధికారాల నిరంకుశత్వాన్ని గ్రహించిన ప్రొ.కె.టి. షా, పీ.డీ.దేశ్‌ముఖ్, హెచ్.వీ.కామత్ వంటివారు వ్యతిరేకించడంతో వీటిని ప్రయోగించాల్సిన పరిస్థితులు పెద్దగా రాకపోవచ్చని, అన్యదా అవసరాల కోసమే వీటిని క్రోడీకరిస్తున్నామని వీటిని మృతాక్షరాలుగా పేర్కొనవచ్చని రాజ్యాంగ పరిషత్ చర్చల్లో అంబేద్కర్ అభిప్రాయం వ్యక్తం చేశారు. కానీ 1975 నుంచి 1977 మధ్యకాలంలో 21 నెలలు దేశం చూసిన చీకటి రోజులు అంబేద్కర్ ఆకాంక్షకు గండికొట్టాయి.

భారతదేశంలో 1975 నాటి అత్యవసర పరిస్థితి-పరిణామాలు

1971లో నిర్వహించిన సార్వత్రిక ఎన్నికల్లో ఇందిరా గాంధీ ఉత్తరప్రదేశ్‌లోని రాయ్‌బరేలీ నియోజక వర్గం నుంచి పోటీచేసి విజయం సాధించారు. ఎన్నికల సమయంలో ఆమె ప్రజా ప్రాతినిధ్య చట్టం-1951ని ఉల్లంఘించారని, నిబంధనలకు వ్యతిరేకంగా తన ప్రచార కార్యక్రమాలకు ప్రభుత్వ వనరులను పెద్ద ఎత్తున వినియోగించారు కాబట్టి ఇందిర ఎన్నిక చెల్లదని ఆమె ప్రత్యర్థి రాజ్ నారాయణ్ అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించారు. 1975 జూన్ 12న అలహాబాద్ హైకోర్టు ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 123(7) ప్రకారం ఇందిరాగాంధీ చర్యలను చట్ట ఉల్లంఘనగా పేర్కొంటూ, ఎన్నిక చెల్లదని స్పష్టం చేసింది. అలాగే ప్రధానిగా కొనసాగరాదని, ఎన్నికల్లో పోటీ చేయకుండా ఆరేళ్ల నిషేధం వర్తిస్తుందని తీర్పు చెప్పింది.

ఈ తీర్పును సవాల్ చేస్తూ ఇందిరాగాంధీ సుప్రీంకోర్టును ఆశ్రయించింది. 1975 జూన్ 24న సుప్రీంకోర్టు ఇందిరాగాంధీ ప్రధానిగా కొనసాగవచ్చని అయితే ఆమె పార్లమెంట్‌లో జరిగే ఏ ఓటింగ్‌లోనూ పాల్గొనరాదని, ఎంపీగా ఆమెకు లభిస్తున్న అన్ని సదుపాయాలను నిలిపివేయాలని మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది.



అప్పటికే దేశంలో అనేక ప్రాంతాల్లో సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాల్లో అవినీతి; నిరుద్యోగం, ధరల పెరుగుదల, ఆర్థిక సంక్షోభాలకు వ్యతిరేకంగా ప్రజల్లో అశాంతి మొదలైంది. 1979లో గుజరాత్‌లో 'నవ నిర్మాణ్ ఆందోళన్', బిహార్‌లో జయప్రకాష్ నారాయణ్ ఉద్యమం ప్రారంభమయ్యాయి. విద్యార్థులు, మధ్యతరగతి ప్రజలు భారీగా ఈ ఉద్యమాల్లో పాల్గొన్నారు. దేశంలోని అన్ని విద్యార్థి సంఘాలు, ప్రతిపక్ష పార్టీలు మద్దతునిచ్చాయి. నవ నిర్మాణ్ ఉద్యమం కారణంగా గుజరాత్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోయింది. జార్జి ఫెర్నాండెజ్ నేతృత్వంలో పెద్ద ఎత్తున రైల్వే సమ్మె నిర్వహించారు. ఇందిరాగాంధీ ఎన్నిక చెల్లదని అలహాబాద్ హై కోర్టు తీర్పునివ్వడం ఈ పరిస్థితులకు ఆజ్యం పోసింది. ఇందిరాగాంధీ రాజీనామా కోసం విపక్షాలు పట్టుబట్టాయి.

> అత్యవసర పరిస్థితికి వ్యతిరేకంగా పంజాబ్‌లో అకాళీ దళ్ ఆధ్వర్యంలో 'డెమోక్రసీ బచావో మోర్చా' ఉద్యమం తీవ్రరూపు దాల్చింది. దీనితో ఒక్క పంజాబ్‌లోనే నలభైవేలమందిని ప్రభుత్వం అరెస్ట్ చేసింది. దేశవ్యాప్తంగా లక్షలాది మంది సభ్యులు, ఉద్యమకారులు జైళ్లపాలయ్యారు.

సుప్రీంకోర్టు నుంచి మధ్యంతర ఉత్తర్వులు పొంది

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

ప్రధానిగా కొనసాగే అనుమతిని ఆమె తెచ్చుకోవడంతో తరవాతి రోజు 1975 జూన్ 25న ప్రతిపక్ష పార్టీలు ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో భారీ ర్యాలీ నిర్వహించాయి. పోరాటం తీవ్రం చేసేందుకు నిర్ణయించాయి. ఇటువంటి అననుకూల పరిస్థితుల్లో 1975 జూన్ 25 అర్ధరాత్రి జాతీయ అత్యవసర పరిస్థితి విధించారు. మంత్రిమండలిని సంప్రదించకుండానే రాష్ట్రపతికి అత్యవసర పరిస్థితి విధించాల్సిందిగా ఇందిరాగాంధీ సిఫార్సు చేశారు. ప్రతిపక్షాలను అణచివేసి తాను పదవిలో కొనసాగేందుకే రాజ్యాంగ ప్రకరణ 352లో ఉన్న 'అంతర్గత కల్లోలం' అనే పదాన్ని వక్రీకరించి అత్యవసర పరిస్థితి విధించారనే అపకీర్తిని ఇందిర మూటగట్టుకున్నారు. ఈ అత్యవసర పరిస్థితి కాలంలో ఆచరించిన అనేక నిరంకుశ విధానాలు కూడా తీవ్ర విమర్శలకు గురయ్యాయి.

1975 అత్యవసర పరిస్థితి కాలం నాటి వివిధ పరిణామాలు

అత్యవసర పరిస్థితి విధించిన కొన్ని గంటల్లోనే అనేక రాజకీయ పార్టీల నాయకులు అరెస్ట్ అయ్యారు. విజయ రాజే సింధియా, జయప్రకాష్ నారాయణ, ములాయం సింగ్ యాదవ్, మొరార్జీ దేశాయ్, చరణ్ సింగ్, జార్జ్ ఫెర్నాండెజ్, అటల్ బిహారీ వాజపేయి, జ్యోతిబసు, అద్వానీ, అరుణ్ జైట్లీ వంటి పలువురు ప్రముఖులు వీరిలో ఉన్నారు. వీరందరూ ప్రధానంగా 'మీసా'(ఎంఐఎస్ఏ- మెయింటెనెన్స్ ఆఫ్ ఇంటర్నల్ సెక్యూరిటీ యాక్ట్), డీఐఎస్ఐఆర్(డిఫెన్స్ ఆఫ్ ఇండియా యాక్ట్ అండ్ డిఫెన్స్ ఆఫ్ ఇండియా రూల్స్), సీఓఎఫ్ఈపీఓఎస్ఏ(కన్సర్వేషన్ ఆఫ్ ఫారిన్ ఎక్స్ఛేంజ్ అండ్ ప్రివెన్షన్ ఆఫ్ స్మగ్లింగ్ యాక్టివిటీస్ యాక్ట్) వంటి కఠిన చట్టాల కింద అరెస్టయ్యారు. జమాతే ఇస్లామీ, ఆర్ఎస్ఎస్ వంటి సంస్థలపై నిషేధం విధించారు.

అత్యవసర పరిస్థితికి వ్యతిరేకంగా పంజాబ్‌లో అకాళీ దళ్ ఆధ్వర్యంలో 'డెమోక్రసీ బచావో మోర్చా' ఉద్యమం తీవ్రరూపు దాల్చింది. దీనితో ఒక్క పంజాబ్‌లోనే నలభైవేలమందిని ప్రభుత్వం అరెస్ట్ చేసింది. దేశవ్యాప్తంగా లక్షలాది మంది సభ్యులు, ఉద్యమకారులు జైళ్లపాలయ్యారు.

(మిగతా రేపటి దిక్సూచిలో)



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్


దిశలు - దూరాలు ● రీజనింగ్



ఏపీపీఎస్సీ పోటీ పరీక్షల ప్రత్యేకం

పార్ట్-2

ముఖ్య రేఖాచిత్రం




నోట్: ఈ చాప్టర్‌కు సంబంధించి అడిగే ప్రశ్నలకు పై రేఖాచిత్రంలో మిడిల్ పాయింట్‌ని బేసిక్‌గా తీసుకోవాలి. పై రేఖాచిత్రంలో మిడిల్ పాయింట్‌ని బేసిక్‌గా తీసుకొంటే మిడిల్ పాయింట్‌కు కుడివైపు అంటే తూర్పు, ఎడమవైపు అంటే పడమర, పై వైపు అంటే ఉత్తరం, కిందవైపు అంటే దక్షిణానికి అని అర్థం.

1. **వినయ్ 40మీ. పడమరకు నడిచిన తరవాత దక్షిణం వైపునకు తిరిగి 30మీ. నడిచాడు. తదుపరి మరల తూర్పునకు 25మీ. నడిచిన తరవాత ఉత్తరానికి తిరిగి 20మీ. నడిచాడు. తదుపరి మరల తూర్పునకు తిరిగి 15 మీ॥ నడిచాడు. అయితే ఇప్పుడు వినయ్ బయలుదేరిన స్థానం నుంచి ఎంతదూరంలో ఏ దిశలో ఉన్నాడు?**

ఎ) ఉత్తరం 10 మీ. బి) దక్షిణం 10 మీ.
సి) తూర్పు 10 మీ. డి) పడమర 10 మీ.

సమాధానం: (బి)

వివరణ:



పై రేఖాచిత్రంలో బయలుదేరిన స్థానం (L)నకు, చేరుకున్న స్థానం (M) కిందకు ఉంది.

ముఖ్యరేఖాచిత్రం(మెయిన్ డయాగ్రమ్)ను పరిశీలిస్తే మిడిల్ పాయింట్ నుంచి కిందకు అంటే దక్షిణం అని చెప్పారు. అంతేకాక పై రేఖాచిత్రాన్ని బట్టి వినయ్ బయలుదేరిన స్థానం నుంచి 10 మీ. దూరంలో ఉన్నాడని తెలుస్తుంది. సమాధానం దక్షిణం 10 మీ.

షార్ట్‌కట్: ముందుగా ప్రశ్నలో ఇచ్చిన సమాచారాన్ని రాసుకోవాలి. అది ఏమంటే పడమర 40, దక్షిణం 30, తూర్పు 25, ఉత్తరం 20, తూర్పు 15. తరవాత ఒకే దిశకు సంబంధించినవి రెండు లేదా అంతకంటే ఎక్కువసార్లు ఉంటే కూడాలి. పై సమాచారంలో తూర్పు 25, తూర్పు 15 లను కూడితే తూర్పు 40 అవుతుంది. ఇప్పుడు పై సమాచారం కింది విధంగా ఉంటుంది.

పడమర$_{40}$, దక్షిణం$_{30}$, తూర్పు$_{40}$, ఉత్తరం$_{20}$.


ఇప్పుడు వ్యతిరేక దిశల విలువ సమానంగా ఉంటే అది క్యాన్సిల్. పై సమాచారంలో పడమర$_{40}$, తూర్పు$_{40}$లు క్యాన్సిల్ అవుతాయి. మిగిలిన రెండింటిలో ఏది ఎక్కువ, ఎంత ఎక్కువ అదే సమాధానం అవుతుంది. తూర్పు$_{40}$, పడమర$_{40}$ క్యాన్సిల్ అవగా మిగిలిన దక్షిణం$_{30}$, ఉత్తరం$_{20}$ లలో దక్షిణం$_{10}$ ఎక్కువ ఉంది అదే సమాధానం అవుతుంది.

2. **వినోద్ 5మీ. ఉత్తరానికి నడిచిన తరవాత కుడివైపునకు తిరిగి 6మీ. నడిచాడు. తదుపరి మరల ఎడమవైపునకు తిరిగి 3 మీ. నడిచాడు. అయితే ఇప్పుడు వినోద్ బయలుదేరిన స్థానం నుంచి ఎంత దూరంలో ఉన్నాడు?**

ఎ) 10 మీ. బి) 14 మీ. సి) 12 మీ. డి) 18 మీ.

సమాధానం: (ఎ)

వివరణ:



D- బయలుదేరిన స్థానం, E- చేరుకున్న స్థానం.

DF- ఒక భుజము 6 మీ॥. EF- మరో భుజము 8 మీ॥ (5 + 3)

DE- కర్ణము

పైథాగరస్ సిద్ధాంతం ప్రకారం కర్ణము^{2} = భుజము^{2} +భుజము^{2}

$$కర్ణము^2 = 6^2 + 8^2$$
$$కర్ణము^2 = 36 + 64$$
$$కర్ణము^2 = 100$$

$$కర్ణము = \sqrt{100} = 10 మీ॥$$

వినోద్ బయలుదేరిన స్థానం (D)కు చేరుకున్న స్థానం (E) 10 మీ. దూరంలో ఉంది.

3. **A, B, C, D అనే నలుగురు బల్లకు నాలుగు వైపుల కూర్చొని క్యారమ్స్ ఆడుతున్నారు. B, D భాగస్వాములు. A ఉత్తరానికి ముఖభాగం కలిగి ఉన్నాడు. D తూర్పునకు ముఖభాగం కలిగి ఉన్నాడు. అయితే దక్షిణానికి ముఖభాగం కలిగి ఉన్న వ్యక్తి ఎవరు?**

ఎ) B బి) C సి) చెప్పలేం డి) ఏదీకాదు

సమాధానం: (బి)

వివరణ: A, B, C, D నలుగురు నాలుగువైపులా కూర్చుంటారు. ఎదురెదురు వ్యక్తులు భాగస్వాములౌతారు. B, D భాగస్వాములని చెప్పారు. కాబట్టి A, C మరొక భాగస్వాములు అవుతారు. A ఉత్తరానికి ముఖభాగం కలిగి ఉన్నాడని ప్రశ్నలో చెప్పారు. A, Cలు భాగస్వాములు కనుక దక్షిణానికి ముఖభాగం కలిగి ఉన్న వ్యక్తి 'C' అవుతారు.

సమాధానం: సి



డాక్టర్ పండిటి మీనాక్షి పవన్,
సీనియర్ ఫ్యాకల్టీ

పోలీసులు సివిల్ వ్యవహారాలకు దూరంగా ఉండాలి

● ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు



ఎమ్మెల్యే రామాంజనేయులు

ప్రత్తిపాడు, జూలై 7: పోలీసులు సివిల్ వ్యవహారాలకు దూరంగా ఉండాలని ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు సూచించారు. భూములకు సంబంధించిన వ్యవహారాలు బోర్డ్ ఆఫ్ స్టాండింగ్ ఆర్డర్స్ ప్రకారం సివిల్ వ్యవహారాలుగా పరిగణించబడతాయన్నారు. వీటిని పరిష్కరించడానికి న్యాయస్థానాలతో పాటు రెవెన్యూ కోర్టులు ఉన్నాయన్నారు. అంతే కాని ప్రజలను ఇబ్బందులు పెట్టే విధంగా భూముల వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటే ఊరుకునేది లేదన్నారు. బుడంపాడు భూమి వ్యవహారంలో హద్దుమీరి ప్రవర్తించిన నల్లపాడు సీఐపై ఉన్నతాధికారులు తీసుకున్న చర్యలను ఆయన గుర్తు చేశారు. నిబంధనల ప్రకారం పోలీసులు నడుచుకోవాలన్నారు. ప్రత్తిపాడు నియోజకవర్గంలో అధికారులు నిబంధనలు పాటించి నడుచుకోవాలని ఆయన కోరారు. నిబంధనలు అతిక్రమించి ఇబ్బందులు కొని తెచ్చుకోవద్దని రామాంజనేయులు హితవు పలికారు.

వంగవీటి రంగా విగ్రహ ఏర్పాటుపై సమావేశం

తాడేపల్లి, జూలై 7: వంగవీటి రంగా విగ్రహాన్ని ఉండవల్లి సెంటర్లో రానున్న కాలంలో ఏర్పడే నాలుగు రోడ్ల కూడలి మధ్య రింగ్‌ను ఏర్పాటు చేసి ప్రస్తుతం తాత్కాలికంగా ఏర్పాటు చేసిన విగ్రహాన్ని రింగుమధ్యలో శాశ్వతంగా ప్రతిష్ఠించాలని పలువురు నేతలు పేర్కొన్నారు. ఉండవల్లి సెంటర్ దేవుడుమాన్యం పక్కన ఉన్న సీవీఆర్ ఫంక్షన్ హాల్‌లో వివిధ పార్టీల, సంఘాల కాపునేతల ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ విషయాన్ని తీర్మానించారు. ఈ సమావేశానికి కాపు జాగృతి జిల్లా ప్రధాన కార్యదర్శి జొన్నా రాజేష్ అధ్యక్షత వహించారు. కమిటీ ప్రధాన లక్ష్యం తాత్కాలికంగా ఉండవల్లి సెంటర్‌లోని సచివాలయం దగ్గర వంగవీటి రంగా విగ్రహాన్ని ఆవిష్కరించడం, అనంతరం రింగు మధ్యలో శాశ్వతంగా ప్రతిష్ఠించి ఆ చౌరస్తాకు రంగా సెంటర్ పేరు పెట్టాలని కమిటీ తీర్మానించింది. ఈ కమిటీకి ఉండవల్లి సెంటర్ రాధారంగా మిత్ర మండలి కమిటీ అన్న పేరును ఖరారు చేశారు. ఈ కమిటీ ఆధ్వర్యంలో రంగా విగ్రహ పరిరక్షణ, పర్యవేక్షణతోపాటు రంగా ఆశయ సాధన కోసం పలు కార్యక్రమాల నిర్వహణ జరుగుతాయని తదుపరి సమావేశంలో కమిటీకి సంబంధించి పూర్తి వివరాలు వెల్లడిస్తామని రాజేష్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వానితులుగా కాపు జాగృతి రాష్ట్ర అధ్యక్షుడు చందు జనార్ధన్, రంగా ముఖ్య అనుచరుడు అల్లుడు సాంబశివరావు, కమిటీ సభ్యులకు అభినందనలు తెలిపారు. ఈ సమావేశంలో ఉప్పు హరిబాబు, పోతురాజు, తోట సాంబశివరావు, జంగాల వెంకటేష్, దాసరి కృష్ణ, లింగంశెట్టి కిషోర్, రాజా రమేష్, చవ్వాకుల కోటేష్‌బాబు, దాసరి దుర్గామల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి నిమ్మకాయలతో అలంకారం



నిమ్మకాయల దండలతో మహంకాళీఅమ్మవారు

దుగ్గిరాల, జూలై 7: దుగ్గిరాల మండలంలో ప్రసిద్ధిచెందిన కేఆర్ కొండూరులోని మహంకాళీ అమ్మవారి దేవస్థానంలో ఆషాఢమాస సందర్భంగా ప్రత్యేక ఉత్సవాలు ప్రారంభించారు. తొలి ఆదివారం అమ్మ వారు నిమ్మకాయల అలంకారంలో భక్తులకు కనువిందు చేశారు. ఉదయం నుంచి భక్తులతో ఆలయం కళకళలాడింది. ఆలయ ఆవరణలో విశేషంగా పెద్ద ఎత్తున వాహన పూజలు జరిపించుకున్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు మధ్యాహ్నం వరకూ క్యూకట్టారు. నైవేద్య సమర్పణ అనంతరం కూడా భక్తుల రద్దీ కొనసాగింది. భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలను అందించారు. ఈవో డీసీహెచ్ వెంకటరెడ్డి, వ్యవస్థాపకధర్మకర్త దేవాభక్తుని రంగప్రసాద్ ఆలయ సిబ్బంది భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేశారు. జూలై 14రెండో ఆదివారం గాజుల అలంకారం లోనూ, 21వ తేదీ మూడో ఆదివారం శాకాంబరిగానూ, 28వతేదీ నాలుగో ఆదివారం అమ్మ వారికి పూలంగి సేవతోపాటు బోనాల ఉత్సవాలు నిర్వహించ నున్నట్లు ఈవో తెలిపారు. బోనాల ఉత్సవంలో పాల్గొనే భక్తులు 108మందికి చిలువూరు గ్రామస్థుడు బయోఫర్ అధినేత రంగిశెట్టి జగదీష్‌బాబు సహకారంతో పూజాసామగ్రి పంపిణీ చేస్తారని, 27వతేదీలోగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని భక్తులకు విజ్ఞప్తి చేశారు.

శాలివాహన సంఘం సభ్యుల పాదయాత్ర

● లోకేశ్ గెలుపుపై హర్షాతిరేకం
● నృసింహాలయంలో మొక్కు చెల్లింపు



నృసింహాలయంలో టెంకాయలు సమర్పిస్తున్న శాలివాహన సంఘం ప్రతినిధులు

మంగళగిరి సిటీ, జూలై 7: కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం, మంగళగిరిలో నారా లోకేశ్ భారీ మెజార్టీతో గెలుపొందడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ గుంటూరు జిల్లాకు చెందిన శాలివాహన సంఘం సభ్యులు ఆదివారం మొక్కులు చెల్లించుకున్నారు. శాలివాహన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పారెళ్ల బసవేశ్వరరావు ఆధ్వర్యంలో 117 మంది సభ్యులు గుంటూరు నుంచి మంగళగిరి పట్టణానికి పాదయాత్రగా వచ్చారు. స్థానిక శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో స్వామివార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం టెంకాయలు సమర్పించి మొక్కు చెల్లించుకున్నారు. తొలుత గుంటూరులో పాదయాత్రను ఎమ్మెల్యే గల్లా మాధవి ప్రారంభించగా, చినకాకాని ఎన్నారై జంక్షన్‌లో మంగళగిరి టీడీపీ శ్రేణులు ఘనస్వాగతం పలికాయి. ఈ సందర్భంగా బసవేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన అంతమై ప్రజాప్రభుత్వం అధికారంలోకి రావడం సంతోషకరమన్నారు. మంత్రి నారా లోకేశ్ ఆధ్వర్యంలో మంగళగిరి ఆదర్శ నియోజక వర్గంగా అభివృద్ధి సాధిస్తుందని, అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందని చెప్పారు. లోకేశ్‌ను అఖండ మెజార్టీతో గెలిపించిన మంగళగిరి ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కోటప్పకొండ సత్రం ఉపాధ్యక్షుడు మోరపాకుల యమలరాజు, గుంటూరు తెలుగు యువత నేత మద్దెల శివప్రసాద్, శాలివాహన సంఘం సభ్యులు గొట్టం అంజనేయులు, ఆవుల యమున, కటికల ఆదిలక్ష్మీ, నల్లగొర్ల శివరామకృష్ణ, మంగళగిరి పట్టణ టీడీపీ ఉపాధ్యక్షుడు గోవాడ దుర్గారావు, నేతలు బాపనపల్లి వాసు, అన్నం నాగబాబు, యెడ్లూరి చిరంజీవి, కే.అంజిబాబు, గోసాల రాఘవ తదితరులు పాల్గొన్నారు.

గోరంత సాయంతో కొండంత ప్రచారం చేసుకుంటున్న బీజేపీ

● విభజన అంశాల పరిష్కారంపై తెలుగు రాష్ట్రాల సీఎంలు చర్చించటం శుభపరిణామం
● అన్న క్యాంటీన్‌ల పునఃప్రారంభం హర్షణీయం : కాంగ్రెస్ నేత తులసిరెడ్డి

గుంటూరు, జూలై 7: ఆంధ్రప్రదేశ్‌కు సంజీవనిలాంటి ప్రత్యేక హోదా ఇవ్వకుండా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గోరంత సాయంతో కొండంత ప్రచారం చేసుకుంటుందని కాంగ్రెస్ సీనియర్ నేత ఎన్ తులసిరెడ్డి విమర్శించారు. రాజీవ్‌గాంధీభవన్‌లో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దశాబ్దకాలంగా పెండింగ్‌లోనున్న విభజన అంశాలను తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కలిసి చర్చించుకోవటం శుభ పరిణామమని పేర్కొన్నారు. అయితే నిర్దిష్టకాల పరిమితిలో ఇరురాష్ట్రాల విభజన సమస్యలను పరిష్కరించుకోవాలన్నారు. అన్న క్యాంటీన్‌లను పునఃప్రారంభించటం హర్షణీయమన్నారు. అలానే పట్టణ ప్రాంతాల్లోనే కాకుండా అన్ని ప్రాంతాల్లోనూ అన్న క్యాంటీన్‌లను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఇటీవల ఢిల్లీ పర్యటనలో సీఎం చంద్రబాబు కేంద్ర ప్రభుత్వానికి ఇచ్చిన వినతిపత్రంలో రాష్ట్ర పునర్నిర్మాణానికి అత్యంత ముఖ్యమైన ప్రత్యేకహోదా, వెనకబడ్డ ప్రాంతాల అభివృద్ధి ప్యాకేజి లాంటి అంశాల ప్రస్తావన లేకుండా ఏవో కొన్ని ఆర్థిక వనరులు అడగటం టీడీపీ కూటమి ప్రభుత్వం లొంగుబాటు వైఖరికి నిదర్శనం అని విమర్శించారు. దివంగత సీఎం వైఎస్ 75వ జయంతి వేడుకలు ఈ నెల 8న మంగళగిరి సీకే కన్వెన్షన్ సెంటర్‌లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దీనికి కాంగ్రెస్ జాతీయ నేతలు, కర్ణాటక తెలంగాణ రాష్ట్ర మంత్రులు హాజరవుతున్నట్లు తెలిపారు. విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కొరివి వినయ కుమార్, డబ్బుకొట్టు రామకృష్ణ, షేక్ సైదా, వాల్మీకి శ్రీనివాసరావు, కొమ్మినేని సురేష్, షేక్ నాగూర్ బాబు, న్యాయవాది యెనుమోలు సురేష్‌బాబు తదిరులు పాల్గొన్నారు.

వైసీపీ అసమర్థతతో మైనార్టీలకు తీరని నష్టం

● ఎస్ఎం షరీఫ్

గుంటూరు, జూలై 7: అసమర్థ వైసీపీ కారణంగా మైనార్టీలకు తీరని నష్టం జరిగిందని మైనార్టీ ఆశయ సాధన సమితి అధ్యక్షుడు ఎస్ఎం షరీఫ్ ఆవేదన వ్యక్తం చేశారు. వన్‌టౌన్‌లోని సంస్థ కార్యాలయంలో మైనార్టీ అంశాలు, రాజకీయ పరిణామాలపై జరిగిన చర్చలో షరీఫ్ మాట్లాడుతూ విభజన చట్టాన్ని అనుసరించి రెండు తెలుగు రాష్ట్రాల పంపకాల విషయంలో ఏపీ మైనార్టీ శాఖకు రావలసిన రూ.60 కోట్ల నిధులు పెండింగ్ ఉన్నాయన్నారు. మైనార్టీ శాఖకు కేటాయింపులే స్వల్పమైతే దీనికి తోడు రూ.60 కోట్లు పెండింగ్‌లో ఉండటం దురదృష్టం అన్నారు. దీనివల్ల మైనార్టీల సంక్షేమం, ఆర్థిక పరిపుష్టి కుంటుపడుతుందని ఈ సందర్భంగా షరీఫ్ ఆవేదన చెందారు. ఈ విషయాన్ని గత వైసీపీ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లామని, అయినా ఆప్రభుత్వం విభజన హామీలు, ఆస్తుల పంపకాల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. దీనివల్ల విభజన ఆంధ్రప్రదేశ్ ఎంతో నష్టపోయిందన్నారు. ఈ నేపథ్యంలో తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రుల భేటీ శుభపరిణామం అని అన్నారు. అపరిష్కృత సమస్యలను పరిష్కరించడంలో చంద్రబాబు దిట్ట అన్నారు. అదేవిధంగా ట్రబుల్ షూటర్‌గా ప్రజల్లో కీర్తి పొందారని తెలిపారు.కార్యక్రమంలో ప్రతినిధులు జానీబాషా, ఆరిఫ్, సంధాని, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక నిల్వలను పరిశీలించిన మైనింగ్ అధికారులు

తుళ్లూరు జూలై 7: మండలంలోని లింగాయపాలెం తాళ్లాయపాలెం ర్యాంపులలో ఇసుక నిల్వలు ఎంతున్నాయనేది ఆదివారం మైనింగ్ శాఖ అధికారులు అంచానా వేశారు. లింగాయపాలెంలో నాలుగు ఇసుక లాట్లు ఉన్నాయి. ఒక లాట్‌లో సోమవారం నుంచి ఇసుకను అందుబాటులోకి తీసుకురానున్నారు. మిగిలిన మూడు లాట్‌లలో ఎంతుందనేది సోమవారం సాయంత్రానికి తేల్చనున్నారు. తాళ్లాయపాలెంలో కూడా లాట్‌లో ఇసుక ఎంతుందని అంచనా వేస్తున్నారు. దానిని కూడా వినియోగదారులకు అందుబాటులో ఉంచుతామని తహసీల్దార్ సుధీర్ చెప్పారు.

కొప్పర్రులో వైసీపీ నాయకుల దుశ్చర్య

● టీడీపీ కార్యకర్త కుటుంబంపై దాడి, ముగ్గురికి గాయాలు



దాడిలో గాయపడిన టీడీపీ కార్యకర్త షేక్ మస్తాన్‌వలీ

పెదనందిపాడు, జూలై 7 : మండల పరిధిలోని కొప్పర్రులో వైసీపీ మూకల ఆగడాలు రోజు రోజుకు మితిమీరుతున్నాయి. ఎన్నికల్లో వైసీపీ ఘోర ఓటమి చెందినప్పటి నుంచి వైసీపీ శ్రేణులు ఓర్వలేక టీడీపీ నేతలపై ఏదో ఒక విధంగా దాడులకు తెగబడుతూనే ఉన్నారు. గతంలో వైసీపీ అధికారంలో ఉన్నప్పటి నుంచి ఈ గ్రామంలో ఇదే పరిస్థితి కొనసాగేది. 2021వ సంవత్సరంలో వైసీపీ నాయకులు దేవుడి ఊరేగింపుల పేరుతో టీడీపీ మాజీ జడ్పీటీసీ ఇంటితో పాటు టీడీపీ శ్రేణుల వాహనాలు కూడా తగులబెట్టారు. నాటి నుంచి నేటి వరకు టీడీపీ నాయకులపై వైసీపీ నేతలు కవ్వింపు చర్యలకు పాల్పడుతూ దాడులకు తెగబడుతున్నారు. ఆదివారం రాత్రి టీడీపీ కార్యకర్త షేక్ నాగుల్‌మీరా పనులు ముగించుకొని ఇంటికి వస్తున్న సమయంలో కొంతమంది వైసీపీ నాయకులు దమ్ముంటే రారా చూసుకుందాం అంటూ హేళన చేస్తూ మాట్లాడారు. నాగుల్‌మీరా కుటుంబసభ్యులు గొడవలు వద్దు అని, గతంలో కూడా గొడవలు పెట్టుకొని ఇబ్బందులు పెట్టారు, ఇది మంచి పద్ధతి కాదు అని షేక్ గుమ్మడి, గౌస్‌బాజీ, రబ్బానీబాజీలు వారించగా, మీరు మాకు చెప్పేదేంటంటూ ఎదురు దాడికి దిగి కళ్ళల్లో కారం చల్లి, రాళ్ళతో కొట్టి గాయపరిచారు. ఈ దాడిలో టీడీపీ కార్యకర్తలు షేక్ మస్తాన్‌వలీ తలకు బలమైన గాయం కాగా గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. షేక్ జాన్‌బాషా, నాగుల్‌మీరాకు స్వల్ప గాయాలయ్యాయి. సంఘటనా స్థలానికి ఎస్ఐ టి.రాజ్‌కుమార్ చేరుకొని ఇరు వర్గాలను చెదరగొట్టారు. దాడికి గల వివరాలు సేకరిస్తున్నారు.

పాదయాత్రతో మొక్కు తీర్చుకున్న టీడీపీ శ్రేణులు



గుండాలపాడు నుంచి మొక్కు తీర్చుకొనేందుకు పాదయాత్రగా వెళ్తున్న గ్రామ టీడీపీ నాయకులు, మహిళలు

ఫిరంగిపురం, జూలై 7 : మండలంలోని గుండాలపాడు గ్రామ తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు, మహిళలు 150 మంది ఆదివారం 13కిలో మీటర్ల పాదయాత్ర చేసి మొక్కు తీర్చుకున్నారు. సీఎంగా నారా చంద్రబాబు నాయుడు ఎన్నిక కావాలని మొక్కుకున్న గ్రామస్థులు తమ కోర్కె నెరవేరినందుకు ఈ రోజు గ్రామంలోని పోలేరమ్మ ఆలయంలో పూజలు చేసి పాదయాత్రగా జొన్నలగడ్డ చేరుకొని షిరిడీ సాయి ఆలయంలో పూజలు చేసి మొక్కు తీర్చుకున్నారు. పాదయాత్రలో వందకు పైగా మహిళలు, వృద్ధులు సైతం పాల్గొనటం విశేషం. కార్యక్రమంలో జిల్లా టీడీపీ కార్యవర్గ కార్య దర్శి కొత్తపల్లి కోటేశ్వరరావు, ఆళ్ళ కృష్ణమూర్తి, కాంద్రు దానయ్య, కే శివయ్య, గుదె శివయ్య కంపా హనుమాన్, నందిగం చంద్రశేఖరరావు, అంబటి రామారావు, ఏలూరి చంద్రమౌళి, బండ్లమూడి నాగేశ్వరరావు, కొల్లి కృష్ణారావు, షేక్ బికారి తదితరులు పాల్గొన్నారు.

నల్లపాడు సీఐగా వెంకన్న చౌదరి బాధ్యతల స్వీకరణ



వెంకన్న చౌదరి

గుంటూరు, జూలై 7: నల్లపాడు సీఐగా డి.వెంకన్నచౌదరి ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు తీసుకున్న వెంటనే స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్స్‌కు కౌన్సెలింగ్ ఇచ్చారు. గొడవల్లో తలదూర్చినా, వివాదాలు సృష్టించినా, పంచాయతీలు చేసినా కఠిన చర్యలు తప్పవన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించినా, పేకాట నిర్వహించినా చర్యలు ఉంటాయన్నారు. ఎవరైనా గంజాయి విక్రయించినా, వినియోగించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం వైన్స్ షాపుల వద్దకు వెళ్లి మద్యం ప్రియులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలిగించే శక్తులపై కఠిన వైఖరి అవలంబిస్తామన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు అవినీతి రహిత సేవలు అందిస్తామన్నారు. అనంతరం ఆయన మర్యాదపూర్వకంగా ఎస్పీ తుషార్‌డూడీ, ఇతర అధికారులను కలిశారు. ఇదిలాఉంటే ఇప్పటి వరకు ఇక్కడ సీఐగా విధులు నిర్వహించిన నరేష్‌కుమార్ సెలవుపై వెళ్లడంతో ఆ స్థానంలో వెంకన్నచౌదరికి అటాచ్‌మెంట్ ఇచ్చారు. నరేష్‌కుమార్‌ను వీఆర్‌కు పంపలేదని ఉన్నతాధికారులు తెలిపారు.

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం



జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద కేకు కట్ చేస్తున్న ఎమ్మార్పీఎస్ నేతలు

మంగళగిరి సిటీ, జూలై 7: ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవం, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. బస్టాండు ఎదురుగా ఉన్న బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ జెండాను నేతలు ఆవిష్కరించి కేకును కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ నియోజకవర్గ అధ్యక్షులు కలకోటి నాగేశ్వరరావు, చిలకా వెంకటేశ్వరరావు, ఎంఈఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శి ఇందుపల్లి రామారావు, నేతలు చందోలు విక్టర్‌పాల్, భాస్కర్, ఏసుపోగు శ్యామల తదితరులు పాల్గొన్నారు.

తాడికొండ, జూలై 7: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా ఆదివారం నిర్వహించారు. తాడికొండ ఎస్సీ కాలనీలోని లైబ్రరి సెంటర్‌లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎమ్మార్పీఎస్ స్థాపించి 30 సంవత్సరాలు పూర్తి చేసుకోవటంతో జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీని యర్ నాయకులు నూతక్కి వీరయ్య, మాజీ సర్పంచ్ నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు


విద్యార్థుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న కార్యదర్శి సుబ్బరత్నమ్మ

గ్రంథాలయాల ప్రాముఖ్యతను వివరించండి

● జిల్లా గ్రంథాలయసంస్థ కార్యదర్శి సుబ్బరత్నమ్మ

తెనాలి రూరల్, జూలై 7: విద్యార్థుల్లో మేధాశక్తిని పెంచి సంపూర్ణ విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దగలిగే గ్రంథాలయాల ప్రాముఖ్యతను గ్రామస్థులకు వివరించి సభ్యత్వాలను పెంచాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి సుబ్బరత్నమ్మ అన్నారు. ఆదివారం మండలంలోని పెదరావూరు శాఖ గ్రంథాలయాన్ని ఆమె ఆకస్మిక తనిఖీచేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులు పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. గ్రంథాలయంలో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నారా.. వేసవి శిక్షణ తరగతుల్లో మీకు మంచి మంచి కథలు చెప్పారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. వారుచెప్పిన సమాధానంతో సంతృప్తి వ్యక్తంచేసి గ్రంథాలయాలకు వచ్చే వారి సభ్యత్వాలు పెంచాలని శాఖ గ్రంథాలయ నిర్వాహకులు ఎ.రాఘవేంద్రరావును ఆదేశించారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. మండలంలోని పెదరావూరు శాఖ గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంకదారి సుబ్బరత్నమ్మ ఆకస్మిక తనిఖీచేశారు. రికార్డులను పరిశీలించి గ్రంథాలయ అధికారి ఏ రాఘవేంద్రరావుకు తగు సూచనలు చేశారు. విద్యార్థులతో ముచ్చటించి గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.


డాక్టర్ శివరామకృష్ణ దంపతులను సన్మానిస్తున్న మానవతా సంస్థ సభ్యులు

డాక్టర్ శివరామకృష్ణ ప్రసాద్‌కు సత్కారం

తెనాలి అర్బన్, జూలై 7: పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందించిన డాక్టర్ కొత్త శివరామకృష్ణ ప్రసాద్ అభినందనీయులని కుమార్ పంప్స్ సంస్థల ఎండీ కొత్త సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. కుమార్ పంప్స్ ఆవరణలో ఆదివారం మానవతా స్వచ్ఛంద సంస్థ వార్షికోత్సవం నిర్వహించారు. సంస్థ లైఫ్ టైమ్ ఎచీవ్‌మెంట్ అవార్డును డాక్టర్ కొత్త శివరామకృష్ణ ప్రసాద్ దంపతులకు ప్రకటించి వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు కొలసాని రాంచంద్ అధ్యక్షతన జరిగిన వార్షికోత్సవ సభలో మాట్లాడుతూ, సమాజానికి విశిష్ట సేవలు అందించిన శివరామకృష్ణ ప్రసాద్‌ను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. వివేకా విద్యా సంస్థల చైర్మన్ రావిపాటి వీరనారాయణ మాట్లాడుతూ, సమాజానికి అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు పేదలను, మధ్య తరగతి వర్గాలను అభివృద్ధి చేసేందుకు సంస్థ ఏర్పాటు చేయడం ముదావహమన్నారు. అనంతరం సంస్థ నూతన కమిటీతో ప్రమాణ స్వీకారం చేయించారు. మానవతా సంస్థ అధ్యక్షుడిగా కటకం ప్రసాద్, కార్యదర్శిగా వెంకట్, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్, కోశాధికారిగా శర్మ, సంయుక్త కార్యదర్శిగా సోమయ్యశాస్త్రి ప్రమాణం చేశారు. శ్రీనివాసరావు, తన్నీరు శ్రీనివాసబాబు, రామలింగాచారి, మొవ్వా సత్యనారాయణ, పావులూరి రమేష్ బాబు తదితరులు ప్రసంగించారు. అయినాల మల్లేశ్వరరావు, వెంపటి సత్యనారాయణ, డాక్టర్ నాగేశ్వరప్రసాద్, డాక్టర్ ఉమామహేశ్వరరావు, డాక్టర్ హరీష్ పాల్గొన్న కార్యక్రమంలో వెంకటలక్ష్మి శిష్యబృందం కూచిపూడి నృత్యంతో ఆకట్టుకుంది.

పట్టణ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడిగా చంద్రశేఖర్

తెనాలి, మారీసుపేట జూలై 7: పట్టణ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడిగా చంద్రశేఖర్‌ను నియమించినట్టు జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు పెండేల సుబ్బారావు తెలిపారు. స్థానిక గంగానమ్మపేటలోని ఆర్యవైశ్య విద్యానిధి ప్రాంగణంలో ఆదివారం మేడికొండూరు పట్టణ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడిగా సకల చంద్రశేఖర్ గుప్తాను నియమిస్తు నియమకపత్రాన్ని జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు పెండేల సుబ్బారావు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంఘ సభ్యుల అభ్యున్నతికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ సభ్యులు పాల్గొన్నారు.


మొహరం వేడుకల్లో జెండా ఆవిష్కరిస్తున్న మత పెద్దలు

ప్రారంభమైన మొహరం వేడుకలు

పొన్నూరు టౌన్, జూలై 7: మతసామరస్యానికి ప్రతీక అయిన హజరత్ మొహమ్మద్ వారి మనుషుల త్యాగాలను స్మరిస్తూ భక్తిశ్రద్ధలతో జరుపుకునే మొహరం పండుగ వేడుకలు ఆదివారం ప్రారంభమయ్యాయి. పట్టణంలోని జీబీజీ రోడ్డు మొల్లా దహెరా మసీద్ వద్ద పీర్లచావిడిలో పీర్లను ఫకీర్ల మేళా వాయిద్యాలతో పూలతో అలంకరించి జెండా ఆవిష్కరించారు. మొల్లాకరీమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మొల్లా హైదర్, మొల్లా గబ్బర్ బాషా, మొల్లా సందాని, మొల్లా నజీర్, షేక్ ఖాదర్, షేక్ మునవార్, మొల్లా సంధాని, మొల్లా నజీర్, షేక్ ఖాదర్, షేక్ మునవార్, మొల్లా నాజుముద్దీన్, మొల్లా ఖాలీల్‌బాషా, మొల్లా బాజి, షేక్ గౌస్, మొల్లా అఫీద్, మొల్లా ఆర్షద్, మొల్లా జలీల్, మొల్లా ఇమ్రాన్, షేక్ రఫీ, షేక్ అమీన్ తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేస్తున్న సొసైటీ ప్రతినిధులు

విద్యార్థులకు ఉపకార వేతనాలు పంపిణీ

తెనాలి అర్బన్, జూలై 7: స్థానిక ముత్తింశెట్టిపాలెంలోని కల్యాణ మండపంలో ఆదివారం పద్మశాలీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ఉపకార వేతనాలు, నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. జొన్నాదుల నరసింహారావు అధ్యక్షతన జరిగిన సభలో ఆదాయపన్ను అధికారి బిట్రా సత్యనారాయణ మాట్లాడుతూ, విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత స్థానం అందుకోవాలన్నారు. తల్లిదండ్రులు తమ పిల్లలు ఇష్టపడే రంగాన్ని ప్రోత్సహించి వారి ఉన్నతికి దోహదపడాలని కోరారు. నేటి పోటీ ప్రపంచంలో నైపుణ్యాలు ఉంటే కానీ ఉద్యోగ అవకాశాలు అందుకోలేరని చెప్పారు. ముత్తేవి రవీంద్రనాథ్, వేదాంతం ఫణీంద్ర, జొన్నాదుల మహేష్, ఆదినారాయణ, అప్పారావు, శ్రీనివాసరావు, పురుషోత్తం, డాక్టర్ పురుషోత్తమరావు తదితరులు పాల్గొన్నారు.

నందివెలుగులో మెగా వైద్యశిబిరం

తెనాలి రూరల్, జూలై 7: మండలంలోని నందివెలుగులో గుంటూరు ఆంధ్ర ప్రైమ్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరం ద్వారా అనారోగ్య సమస్యలతో వచ్చిన గ్రామస్థులకు వైద్యులు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. గ్రామ ఎంపీటీసీ తిన్నలూరి విజయలక్ష్మి సహకారంతో జరిగిన కార్యక్రమంలో ఆంధ్రప్రైమ్ హాస్పటల్ వైద్యుడు డాక్టర్లు అచ్చంశెట్టి అన్వేష్ కుమార్, జల్లేపల్లి తేజస్వీ, కాసుల సాయి రాజశేఖర్, పవన్‌బడుగు, జి.మాధవీలత, మంగిశెట్టి విజయకృష్ణ, రినా, సాగర్, బూసిరెడ్డి విశ్వ, దేదీప్య, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జీబీసీ రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం

● విస్తరణ బాధితులకు న్యాయంపై ఎమ్మెల్యే హామీ


జీబీసీ రోడ్డులో సాగుతున్న బీటీ రోడ్ నిర్మాణం

పొన్నూరు టౌన్, జూలై 7: పొన్నూరు పట్టణంలో ప్రజల చిరకాల వాంఛ అయిన జీబీసీ రోడ్డు విస్తరణ పనులు ఎట్టకేలకు పూర్తి అయ్యే దశలోకి వచ్చాయి. పొన్నూరు పట్టణంలో ప్రధాన రహదారి జీబీసీ రోడ్డును విస్తరించాలని దశాబ్దాలుగా ప్రజలు కోరుతూ వచ్చారు. పెరిగిన ట్రాఫిక్ నేపథ్యంలో రోడ్డు విస్తరణ అనివార్యమైంది. అయితే విస్తరణలో 166 భవనాలు శాశ్వతంగాను, పాక్షికంగాను కోల్పోనున్నాయి. బాధితులకు న్యాయం చేయటానికి గత తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ అప్పటి ప్రభుత్వంతో అనేకమార్లు సంప్రదింపులు జరిపారు. విస్తరణలో సర్వం కోల్పోయే కుటుంబాలకు ఆర్థిక పరిహారం అందించి ఆదుకోవాలని ప్రభుత్వానికి విన్నవించారు. ప్రభుత్వ నిర్ణయం తీసుకునే దశలో ఎన్నికలు రావటం ప్రభుత్వాలు మారిపోయాయరు. నాలుగున్నర ఏళ్ల పాటు విస్తరణ విషయాలు వదిలేసిన వైసీపీ పాలకులు ఎన్నికల ముందు విస్తరణ చేపట్టేందుకు హడావిడిగా భవనాలను కూల్చివేశారు. విస్తరణ జరిగిన తీరుపై పట్టణ వాసులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినప్పటికీ పాలకులు, అధికారులు వారి అభ్యర్థనలను సైతం పట్టించుకోకుండా బాధితులకు పరిహారం అందించకుండా రాత్రికి రాత్రి భవనాలను నేలమట్టం చేశారు. దశాబ్దాల తరబడి వంశపార్యపరంగా సంక్రమించిన భవనాలు, దశాబ్దాలుగా జీవనోపాధి కల్పించిన దుకాణాలు కళ్లెదుటే నేలమట్టం అవుతుంటే విస్తరణ బాధితులు కంట నీరు నింపుకొని కళ్లప్పగించి చూస్తుండిపోయారు. గత పాలకుల దౌర్జన్యాలు, అధికారుల అడ్డగోల్ల నిర్ణయాలతో 166 భవనాల యజమానులు వీధిన పడ్డారు. కేవలం 11 భవనాలకు సంబంధించి మాత్రమే టీడీఆర్ బాండ్ల రూపంలో మాత్రమే పరిహారం అందించి అధికారులు చేతులు దులుపుకున్నారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రావటంతోపాటు ఎమ్మెల్యేగా ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ విజయం సాధించారు.

ఎన్నికల హామీలో భాగంగా భవన యజమానులకు న్యాయం చేస్తానని నరేంద్ర కుమార్ ఇచ్చిన హామీని నిలబెట్టుకునే క్రమంలో శుక్రవారం భవన యజమానులతో నరేంద్ర కుమార్ సమావేశమైయ్యారు. వారి సాధక బాధలు ఆలకించిన అనంతరం 40 రోజుల్లో భవన యజమానులకు న్యాయం చేస్తానన్ని హామీ ఇవ్వటంతో భవన యజమానులు హర్షం వ్యక్తం చేశారు. యజమానుల్లో భరోసా కల్పించిన అనంతరం జీబీసీ రోడ్డు విస్తరణ పనులను నరేంద్ర కుమార్ ఆదేశాలతో అధికారులు ప్రారంభించారు. ఆదివారం జీబీసీ రోడ్డు, బీటీ రోడ్డు విస్తరణ పనులు ప్రారంభమైయ్యాయి. అసంపూర్తి పనులతో గత కొన్ని నెలలుగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న పొన్నూరు ప్రాంత వాసులు రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం కావటంతో హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి ఒక్కరూ భగవతారాధన చేయాలి

రామదూత చక్రవర్తి


అమ్మవారికి క్షీరాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రకుమార్, జ్యోతిర్మయి దంపతులు

పొన్నూరు టౌన్, జూలై 7: ప్రతి ఒక్కరూ భగవారాధన చేయాలని రామదూత చక్రవర్తి పిలుపునిచ్చారు. పట్టణంలోని పరంధయ్య కన్వెన్షన్ హాల్లో శ్రీవేణుదత్త సువర్ణలక్ష్మి దాంపత్య వ్రతహోమాది పూజలు పలువురు దంపతులతో ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్, జ్యోతిర్మయి దంపతులు ఈ పూజల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా అవధూత చక్రవర్తి భగవాన్ రామదూత చక్రవర్తి అనుగ్రహభాషణం చేశారు. వేణుదత్త లక్ష్మీదాంపత్య వ్రత హోమాలు ఆచరించడం వలన అనేక బాధలనుంచి విముక్తులై, సుఖమయజీవనం గడిపేందుకు అనుగ్రహం లభిస్తుందన్నారు. అమ్మవారిని ఎవరైతే నిత్యం భక్తితో పూజిస్తారో ఆ కుటుంబం ఆయురారోగ్యాలతో భోగభాగ్యాలతో విరాజిల్లుతుందన్నారు. అమ్మవారిదీక్ష చేస్తే అఖండ తేజోవంతులై వర్ధిల్లుతారన్నారు. వేణుదత్త సువర్ణలక్ష్మి దాంపత్య వ్రత హోమం చేయడం వల్ల కలిగే ఫలితాన్ని భక్తులకు వివరించారు. దీక్షవల్ల వచ్చే పుణ్యఫలితాన్ని చక్కగా వివరించారు. ఇంతటి మంచి కార్యక్రమాన్ని ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే నరేంద్రకుమార్, జ్యోతిర్మయి దంపతులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా నరేంద్రకుమార్ మాట్లాడుతూ ప్రజలందరూ సుఖసంతోషాలతో తులతూగాలన్న కాంక్షతో వేణుదత్త సువర్ణలక్ష్మి దాంపత్య వ్రతహోమాది పూజలను రామదూత చక్రవర్తి నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అవదూతస్వామి సేవకులు, పెద్దసంఖ్యలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన మ్యూజికల్ నైట్

తెనాలి అర్బన్, జూలై 7 : సంస్కృతిక సంస్థ సంకీర్తన ఆధ్వర్యంలో నిర్వహించిన మ్యూజికల్ నైట్ శ్రోతలను అలరించింది. మధుర గాయకుడు మహ్మద్ రఫీ వర్ధంతిని పురస్కరించుకుని తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో మ్యూజికల్ నైట్ నిర్వహించారు. డాక్టర్ పురుషోత్తమరావు ఆధ్వర్యంలో పలువురు గాయకులు రఫీ మధుర గీతాలను ఆలపించారు. డాక్టర్ పురుషోత్తమరావు పలు గీతాలు ఆలపించారు. షేక్ సైదా, మల్లిక, రాజేశ్వరరావు, ఆలీఖాన్ తదితరులు గీతాలు ఆలపించారు. పలువురు వైద్యులు నన్నపనేని ప్రతాప్, వంగా సాంబిరెడ్డి, ప్రసాదరావు, రంగారావు, సోమశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


గీతాలు ఆలపిస్తున్న డాక్టర్ పురుషోత్తరావు

నేటి నుంచి ఆహ్వాన నాటికల పోటీలు

తెనాలి అర్బన్, జూలై 7 : రోటరీ కళా పరిషత్, ఈదర రామారావు చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో ఆహ్వాన నాటికల పోటీలు సోమవారం ప్రారంభం అవుతాయని నిర్వాహకులు ఈదర పూర్ణచంద్ తెలిపారు. ఆదివారం నాటికల పోటీల కరపత్రాలను విడుదల చేశారు. తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో రెండు రోజుల పాటు నాటికలు ప్రదర్శిస్తామన్నారు. సోమవారం ఇంద్రప్రస్థం, స్వప్నం రాల్చిన అమృతం, అందిన ఆకాశం, 9న కపిరాజు, నాన్న నేను వస్తా నాటికలు ప్రదర్శిస్తారని చెప్పారు. పావులూరి రాంబాబు, నల్లూరి వెంకటేశ్వరరావు, ఈదర శ్రీనివాసరావు, కన్నెగంటి మురళీకృష్ణ పాల్గొన్నారు. రోటరీలో ఉత్తమ సేవలు అందించిన అందె రత్న ప్రభాకర్‌కు రోటరీ పురస్కారం ప్రదానం చేస్తామని తెలిపారు.


విశ్రాంత ఉద్యోగులను సత్కరిస్తున్న పూర్వ విద్యార్థి సంఘ సభ్యులు

విశ్రాంత ఉద్యోగులకు ఘన సత్కారం

తెనాలిమారీసుపేట, జూలై 7: పలు శాఖల్లో ప్రభుత్వ ఉద్యోగులుగా పనిచేసి పదవీ విరమణ చేసిన విశ్రాంత ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. మండల పరిధిలోని కొలకలూరు జిల్లా పరిషత్ హైస్కూల్ 1977-1978 బ్యాచ్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో మెడికల్ ఆఫీసర్‌గా పనిచేసిన డాక్టర్ ముత్తె శ్రీనివాసరావు, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ కర్నూలు ఉన్నం ఎహెజ్కేల్, నీటి పారుదల శాఖ రేపల్లె సూపరింటెండెంట్ జానీభాష, అకౌంటెంట్ ఆఫీసర్ కాలిశెట్టి శ్రీనివాసరావు (తెలంగాణ)లను ఘనంగా సత్కరించి మెమోంటోలు అందించారు. కార్యక్రమాన్ని పూర్వ విద్యార్థుల సంఘ అధ్యక్షుడు చంద్రహాస్ ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థులు ప్రయాగ చంద్రశేఖర్, కె.సాయి, బాలాజీ, శ్యామ్ సుందర్, మజీద్, వెంకట్రామయ్య, మల్లిఖార్జున, బసవశంకర్, విజయలక్ష్మి, ఝాన్సీ, శివపార్వతి, సామ్యేలు, నరసింహారావు, ఉషారాణి, తదితరులు పాల్గొన్నారు.

రోటరీ క్లబ్ సేవలను మరింతగా చేరువచేస్తాం

● నూతన అధ్యక్షుడు డాక్టర్ రవి రాకేష్‌దేవ్

పొన్నూరు టౌన్, జూలై 7: రోటరీ క్లబ్ సేవలను పేదలకు మరింతగా చేరువచేసి సమాజంలో క్లబ్‌కు మరింత పేరుతెచ్చేలా సభ్యులందరి సహకారంతో ముందుకు వెళతానని రోటరీ క్లబ్ పొన్నూరు నూతన అధ్యక్షుడు డాక్టర్ రవి రాకేష్‌దేవ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని రోటరీ క్లబ్ నూతన భవన నిర్మాణ కార్యాలయ ప్రాంగణంలో క్లబ్ అసిస్టెంట్ గవర్నర్ మలినేని పెరుమాళ్ళ ఆధ్వర్యం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్ష, కార్యదర్శులుగా డాక్టర్ రవి రాకేష్‌దేవ్, బాలకృష్ణ, ఇతర సభభ్యులచే అసిస్టెంట్ గవర్నర్ ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో డిప్యూటీ గవర్నర్ పాటిబండ్ల శివరంజని, 2025-26 ఎలెక్ట్ డిస్ట్రిక్ గరవ్నర్ సోమవరపు రాంప్రసాద్ మాట్లాడుతూ సమాజసేవలో రోటరీ క్లబ్ ముందుందన్నారు. క్లబ్‌సేవలకు ఆకర్షితులైన అనేకరంగాల ప్రముఖులు సభ్యులుగా చేరేందుకు వస్తున్నారన్నారు. నూతనంగా నిర్మిస్తున్న భవన నిర్మాణానికి రూ.కోటి విలువజేసే స్థలాన్ని ఉచితంగా అందించిన కొసరాజు సత్యనారాయణకు ఆయన ప్రత్యేక ధన్యావాదాలు తెలిపారు. క్లబ్‌ద్వారా చేసిన అనేక సేవా కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో మాజీ ఉపాధ్యక్షులు వై. వీరయ్య, బి.రామారావు, పి.రవీంద్రనాథ్, బీవీ చౌదరి, జీఎంఎస్ గుప్తా, బి. శ్రీనివాసరావు, ఎన్ మేషనాథ్, కె.రమేష్, కె.శ్రీనివాస్, తోట భానుప్రసాద్, జి.శివరామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నక్షత్ర దోష నివారణ పూజలు

తెనాలి, మారీసుపేట జూలై 7: గంగానమ్మపేటలోని శ్రీవిద్యాపీఠం నందు సాలిగ్రామ మఠం ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రజ్ఞానంద సరస్వతి (బాల స్వామి) పర్యవేక్షణలో ఆదివారం పుష్యమి నక్షత్రం వారిచే హోమాలను, యజ్ఞ పూజలను నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ నంబూరు వెంకట కృష్ణమూర్తి, సహాయ కార్యదర్శి ముద్దాభక్తుని రమణయ్య, పి వెంకటేశ్వరావు, రావూరు సుబ్బారావు, రామకృష్ణ, కోనా నాగేశ్వరరావు, గోపాల కృష్ణ, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.


విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేస్తున్న మేదరి సంఘ సభ్యులు

విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

తెనాలి, మారీసుపేట జూలై 7: స్థానిక గైయిటీ థియేటర్ వద్ద ఆదివారం విద్యార్థులకు నోట్ బుక్స్‌ని తెనాలి పట్టణ మేదరి (మహేంద్ర) సంఘం ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీడీపీ సీనియర్ నాయకుడు మహ్మద్ ఖుద్దూస్ పాల్గొని విద్యార్థులకు నోట్ బుక్సను పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని సంఘ అధ్యక్షుడు కోడె నాగేశ్వరావు ఆధ్వర్యంలో సభ్యులు కనికరం రాంబాబు, చందు శరత్‌బాబు, కోన రాఘవులు, శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

దాడిపై కేసునమోదు

తెనాలి రూరల్, జూలై 7: ఒకరిపై మరొకరు దాడికి పాల్పడ్డారని అందిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ కోటేశ్వరరావు తెలిపారు. మండలంలోని జగ్గడిగుంటపాలెంకు చెందిన ప్రవీణ్ అనే వ్యక్తిని అదే గ్రామానికి చెందిన నక్క కోటి, బాషా అనే ఇద్దరు కలిసి రాయితో కొట్టి గాయపరిచారు. దీనిపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.


తూటికాడతో పారుదల లేక మురుగుతో ఉన్న పాటి కాలువ

గుర్రపు డెక్క, తూటికాడతో...

అపరిశుభ్రంగా పాటి కాలువ

తెనాలి, మారీసుపేట జూలై 7: పట్టణంలో ప్రధాన కాలువలో ఒకటైన పాటి కాలువ గుర్రపు డెక్క, తూటికాడతో నిండి నీటి పారుదల లేక దోమలకు ఆవాసాలుగా మారుతుంది. ఈ పాటి కాలువలో జంతు మృత కళేబరాలను పడవేయడం వలన కాలువలోని నీరు కలుషితమై దుర్గధం వెదజల్లుతున్నదని పట్టణ ప్రజలు వాపోతున్నారు. పాటి కాలువ నీటిపై ఆధారపడిన రైతుల పంటలకు నీరు అందక ఇబ్బందులకు గురౌతున్నారు. ఈ కాలువను ఆనుకొని ఇరిగేషన్ కార్యాలయం, డీఎస్పీ కార్యాలయం ఉండటం విశేషం. కూటమి ప్రభుత్వం అధికారం చెపట్టిన వెంటనే నియోజకవర్గ ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ ముందుగా ప్రధాన పంట కాలువలలో గడ్డి జాతి మొక్కలను, డ్రెయిన్‌లలో సిల్ట్‌ను, తొలగించాలని సంబంధిత అధికారులకు ఆదేశాలను ఇచ్చారు. కాని ఖరీఫ్ సీజన్ మొదలైన పాటి కాలువలోని వ్యర్థాలను అధికారులు తొలగించలేదు. జిల్లా ఆరోగ్య వైద్యాధికారులు స్టాఫ్ డయేరియా, ఫ్రైడే డ్రైడే కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. కాని క్షేత్రస్థాయిలో అమలు కావడంలేదు. పాటి కాలువలో నీటి పారుదల లేక దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయని, తద్వారా డయేరియా, డెంగీ, మలేరియా ప్రబలే ప్రమాదం పొంచి ఉన్నదని స్థానిక ప్రజలు భయపడుతున్నారు. బాలాజీరావుపేటలో దీనికి తోడు పారిశుధ్యం లోపంతో పందులు సైరవిహారం చేస్తుండటంతో ఆ పరిసరాలు అపరిశుభ్రంగా మారి దుర్గంధంతో ఆ ప్రాంత ప్రజలు జీవనం సాగించవలసి వస్తుంది. సీజనల్ వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉన్నదని స్థానికులు వాపోతున్నారు. ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి పాటి కాలువలోని వ్యర్థాలను తొలగించి, పారిశుధ్య పనులను మెరుగుపర్చాలని స్థానికులు, పట్టణ అభివృద్ధి కమిటీ సభ్యులు కోరుతున్నారు.


కొల్లిపరలో ఇసుక నిల్వల గురించి అధికారులతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ ప్రఖార్‌జైన్

ఉచిత ఇసుక విధానాన్ని సక్రమంగా అమలు చేయాలి

● సబ్‌కలెక్టర్ ప్రఖార్‌జైన్

కొల్లిపర, జూలై 7: ఉచిత ఇసుక విధానాన్ని సక్రమంగా అమలు చేయాలని సబ్‌కలెక్టర్ ప్రఖార్‌జైన్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని మున్నంగి, కొల్లిపర గ్రామాల్లో ఉన్న ఇసుక నిల్వలను ఆయన పరిశీలించారు. సోమవారం నుంచి ఉచిత ఇసుక విధానం అమల్లోకి రావటంతో తగిన ఏర్పాట్లు చేయాలని మండల స్థాయి అధికారులకు ఆదేశించారు. ఈ సందర్భంగా ప్రఖార్‌జైన్ మాట్లాడుతూ ఇసుక విక్రయాలు అధికారుల ఆధ్వర్యంలోనే జరుగుతుందన్నారు. ప్రభుత్వం ఆదేశాల మేరకు బుకింగ్, చెల్లింపులు అంతా ఆన్‌లైన్‌లోనే ఉంటుందన్నారు. ఇసుక నిల్వలు, లోడింగ్ చార్జీలను వెబ్‌సైట్‌లలో అందుబాటులో ఉన్నట్లు ప్రజలకు తెలియజేయాలన్నారు. ఒక్కో వ్యక్తికి ఆధార్ కార్డుపై రోజుకు 20టన్నులు మాత్రమే ఇసుక తీసుకెళ్లేందుకు అనుమతి ఉన్నట్లు తెలిపారు. కొల్లిపరలో 33టన్నులు, మున్నంగిలో లక్షా 81టన్నులు ఇసుక అందుబాటులో ఉందన్నారు. ఇసుక అవసరం ఉన్న ప్రతి వ్యక్తికి అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నారు. పోలీసులు వచ్చే వాహనాలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. సబ్ కలెక్టర్ వెంట తహసీల్దార్ శ్రీనువాసులు, ఎంపీడీవో విష్ణుప్రసాద్, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ రవీంద్రరెడ్డి, ఆర్ఐ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


స్వామివారికి ఆషాడం పట్టి సమర్పిస్తున్న భక్తులు

దశావతారుని సన్నిధిలో ఆషాడ మాస పూజలు ప్రారంభం

పెదకాకాని, జూలై 7: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట ఉన్న దశావతార వెంకటేశ్వర స్వామి దివ్య క్షేత్రంలో ఆషాడ మాస పూజలు ఆదివారం ప్రారంభమయ్యాయి. రాష్ట్ర నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తులతో ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపించారు. ఆషాడమాసం సందర్భంగా మిడ్ వ్యాలీ సిటీ నివాసితులు దశావతార వేంకటేశ్వర స్వామి వారికి ఆషాడపట్టి సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త లింగమనేని పూర్ణ భాస్కర్ రావు దంపతులు, మిడ్ వ్యాలీ సిటీ నిర్వాసితులు, భక్తులు పాల్గొన్నారు.


వేళాంగిణి మాతను సందర్శించేందుకు వెళుతున్న మహిళలకు వీడ్కోలు పలుకుతున్న ఎమ్మెల్యే నరేంద్ర కుమార్

వేళాంగిణికి తెలుగు మహిళలు

పొన్నూరు టౌన్, జూలై 7: పొన్నూరు ఎమ్మెల్యేగా ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ 6వసారి అఖండ విజయం సాధించటంతో తెలుగు మహిళలు నాగపట్నంలో మొక్కుబడులు తీర్చుకునేందుకు ఆదివారం తరలివెళ్లారు. మండల పరిధిలోని కట్టెంపూడి గ్రామానికి చెందిన మహిళలు ఎమ్మెల్యేగా నరేంద్రకుమార్ గెలుపొందితే నాగపట్నం వచ్చి వేళాంగిణి మాత పరిశుద్ధ దేవాలయంలో మొక్కుకున్నారు. నరేంద్రకుమార్ విజయం సాధించటంతో నాగపట్నం బయల్దేరిన మహిళలు, గ్రామస్థులకు ఆదివారం నరేంద్ర కుమార్ నిడుబ్రోలులో రైల్వేస్టేషన్‌లో వీడ్కోలు పలికారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బండ్లమూడి బాబురావు, కట్టెంపూడి అధ్యక్షుడు యక్కటి పద్మారావు, మండల రైతు కమిటీ అధ్యక్షుడు వడాలశెట్టి శ్రీనివాసరావు, నాయకులు సత్యనారాయణ, రమాదేవి, నాగేశ్వరరావు, రామారావు, గరిగంటి సాయి బాబు, అద్దేపల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.



పతాకావిష్కరణ చేస్తున్న ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు

తెనాలి అర్బన్, జూలై 7: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలను రూరల్ మండల గ్రామం మల్లెపాడులో ఆదివారం ఘనంగా నిర్వహించారు. గ్రామ యువత ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ పతాకాన్ని ఎగురవేశారు. పలువురు కార్యకర్తలు ఎమ్మార్పీఎస్ ఆవిర్భావం, పోరాటం వివరించారు. మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ మాదిగల సంక్షేమానికి పాటుపడిందని వక్తలు గుర్తు చేశారు. అఖిల్, మధు, జోషి, గోపి, చంద్రశేఖర్, రత్నరాజు పాల్గొన్నారు.

పొన్నూరులో..

పొన్నూరు టౌన్, జూలై 7: మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి ఆవిర్భావ దినోత్సవం ఆదివారం పొన్నూరు పట్టణంలో ఘనంగా జరిగింది. ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ సమన్వయకర్త మురికిపూడి ఉదయరాజు ఆధ్వర్యంలో పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం నుంచి ఐల్యాండ్ సెంటర్‌లోని బాబు జగ్జీవన్‌రాం విగ్రహం వరకు ర్యాలీని నిర్వహించారు. మందకృష్ణ మాదిగ 60వ జన్మదినోత్సవ వేడుకలు నిర్వహించారు. కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో ఎమార్పీఎస్ నాయకులు ఆరెమండ్ల విజయ్‌కుమార్, చిలకా రవిబాబు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

కొలకలూరులో ...

తెనాలి రూరల్, జూలై 7: మండలంలోని కొలకలూరులో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణమాదిగ 60వ జన్మదినోత్సవాన్ని టీడీపీ నాయకులు సుద్దపల్లి నాగరాజు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మందకృష్ణమాదిగ జన్మదినోత్సవ కేక్‌ను కట్‌చేసి పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. పలువురు నిర్వాహక సభ్యులు పాల్గొన్నారు.

కులాల మధ్య చిచ్చుపెడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలి

● టీడీపీ జిల్లా కార్యదర్శి అమృతరాజు

కొల్లిపర, జూలై 7: ప్రశాంతంగా జీవనం సాగించే రాష్ట్ర ప్రజల్లో కులాల మధ్య చిచ్చు పెట్టడం, ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టేలా సోషల్ మీడియాను దుర్వినియోగం చేస్తున్న ఉత్తరాంధ్ర నౌ ట్విట్టర్ ప్రొఫైల్ నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకోవాలని టీడీపీ జిల్లా కార్యదర్శి కంచర్ల అమృతరాజు ఆదివారం ఎస్ఐ రవీంద్రరెడ్డి వినతిపత్రాన్ని అందజేశారు.